విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్ గుంటూరు, పల్నాడు

గురువారం 05 డిసెంబరు 2024 8 పేజీలు

రైతులకు ఇబ్బంది లేకుండా

ధాన్యం కొనుగోళ్లు

- జిల్లాలో 1.53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- రైతులఖాతాల్లో రూ.280 కోట్లు జమ
- మంత్రి కొల్లు రవీంద్ర

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : కలెక్టరేట్ లోని మీకోసం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, అధికారులు మిల్లర్లతో రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర సమావేశం నిర్వహించారు. జిల్లాలో ధాన్యం సేకరణ, రైతుల సమస్యలపై సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా కలక్టర్ డీకె. బాలాజీ, జాయింట్ కలక్టర్ గీతాంజలీ శర్మ ధాన్యం సేకరణలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ వాతావరణ మార్పుల వలన ధాన్యం సేకరణకు సంబందించి రైతుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి వచ్చాయని అన్నారు. జిల్లాఓ ఈ ఏడాది ధాన్యం దిగుబడి అంచనా 9.79 లక్షల మెట్రిక్ టన్నులు కాగా స్థానిక వినియోగం పోను సుమారు -మిగతా 2 లో ...

సమస్యలు పరిష్కరిస్తాం

49వ రోజు ప్రజాదర్బార్‌లో మంత్రి నారా లోకేష్ భరోసా

విశాలాంధ్ర- తాడేపల్లి : ప్రజాదర్బార్‌లో వచ్చే సమస్యలు పరిష్కరించి బాధితు లకు అండగా నిలుస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఉండవల్లిలోని నివాసంలో 49వ రోజు ప్రజాదర్బార్‌కు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. మంత్రిని కలిసి తాము ఎదుర్కొంటున్న -మిగతా 2 లో ...

సమస్యల పరిష్కారం లక్ష్యంగా

రెవెన్యూ సదస్సులు

6 నుండి జిల్లాలో సదస్సులు : కలెక్టర్ లక్ష్మీశ

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : రెవెన్యూ సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో ఈనెల 6వ తేదీ నుండి జిల్లాలో రెవెన్యూ సదస్సులను నిర్వాహణకు చర్యలు తీసుకోవడం జరిగిందని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ తెలిపారు. ఈనెల 6వ తేది నుండి రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించన్ను రెవెన్యూ సదస్సుల నిర్వహణపై రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోదియా, సీసీఎల్ఏ -మిగతా 2 లో ...

కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై

9, 10న నిరసనలు

-26న సీపీఐ శతవార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించాలి
-సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీవరప్రసాద్

విశాలాంధ్ర-చిలకలూరి పేట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానలకు నిరసనగా సీపీఐ ఆధ్వర్యంలో డిసెంబర్ 9, 10 తేదీలలో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.మారుతీవరప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏరియా సీపీఐ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న మారుతీవరప్రసాద్ -మిగతా 2 లో ...

షెల్టర్లు ఏర్పాటు చేయాలి

గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : జిల్లాలో భారీ వర్షాలు, వరదలు వంటి విపత్తుల సమయంలో లంక గ్రామాలు, లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలతో పాటు పశువులను రక్షిత ప్రాంతాల్లోకి తరలించేలా ముందస్తుగా షెల్టర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనితకు తెలిపారు. విపత్తుల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత బుధవారం వీడియో కాన్ఫరెన్స్ -మిగతా 2 లో ...

ఆర్టీసీ లైసెన్స్ కూలీల విశ్రాంత గది పునః ప్రారంభం 2

ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ఏకపాత్రాభినయ, పాటల పోటీలు 5

చెరుకూరికి ద్రోణాచార్య అవార్డు ఇవ్వాలి 3

వీధి విక్రయదారులను ఆదుకోండి 8

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తాం

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో అంగన్‌వాడీ కార్మికుల సమస్యలు పరిష్కరించటానికి ప్రభుత్వం అంగీకరించింది. ఈ మేరకు గుంటూరులోని ఐసీడీఎస్ డైరెక్టర్ ఆయన కార్యాలయంలో బుధవారం ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ అనుబంధ అంగన్‌వాడీ మూడు యూనియన్‌లు ఆధ్వర్యంలో సుదీర్ఘ చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మీడియాతో మాట్లాడతూ చర్చల సందర్భంగా డైరెక్టర్ ప్రతి డిమాండ్‌పై చర్చించి కొన్ని డిమాండ్‌లను పరిష్కరించటానికి హామీ ఇచ్చారని చెప్పారు. అంగన్వాడీలకు వేతనాలు పెంపు, గ్రాట్యూటీ అమలు అంశాలపై ముఖ్యమంత్రి, ఐసీడీఎస్ మంత్రి తో మాట్లాడి త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మట్టిఖర్చుల జీవో వెంటనే ఇస్తామని చెప్పారు. సహాయ కుల పదోన్నతలుపై కార్యాచరణ రూపొందించి వెంటనే అర్హులందరికీ పదోన్నతి కల్పిస్తామన్నారు. యాప్‌లన్నీ కలిపి ఒక యాప్ గా మారుస్తామని, బాల సంజీవని యాప్‌లో చేస్తే పోషణ ట్రాక్టర్ యాప్‌లో కూడా నమోదయ్యే విధంగా కేంద్రానికి లేఖ రాస్తామని, రికార్డు వరకు తగ్గిస్తామని, . ఓటీపీ రద్దు చేస్తామని, ఈకేవైసీ, మహిళా పోలీస్ ఓటీపీని రద్దు చేస్తామని హామీ ఇవ్వటం జరిగిందన్నారు. మెను ,మెనూ రేట్లు పెంచాలని, పిల్లలకు సాయంత్రం స్నాక్స్, ఇస్తామని, యూనిఫాం -మిగతా 2 లో ...

విలేకరులు కావలెను

ఎన్టీఆర్ జిల్లాలో ఈ క్రింది ప్రాంతాల్లో విలేకరులుగా పని చేయుటకు అభ్యర్థులు కావలెను. కనీస విద్యార్హత ఇంటర్. స్థానిక పరిస్థితులపై కనీసం అవగాహన కలిగి ఉండాలి. తెలుగు భాషలో ప్రావీణ్యం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

పెనుగంచిప్రోలు, ఇబ్రహీంపట్నం, మైలవరం, రెడ్డిగూడెం

సంప్రదించండి..

విశాలాంధ్ర దినపత్రిక

విశాలాంధ్ర ప్రధాన కార్యాలయం,
చంద్రంబిల్డింగ్స్, చుట్టుగుంట, విజయవాడ - 520004.

ఫోన్ :8886782790, e-mail: visalvja@gmail.com

(మొదటి పేజీ తరువాయి)

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లు

5.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు యంత్రాంగాన్ని సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రతి ఏడాది నవంబరు నెలలో 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగేదని, ఈ నవంబరులో 1.53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరిగిందని, కారణం మిషన్ కటింగ్ వల్ల లోడింగ్, అన్‌లోడింగ్, ఒకే సారి ధాన్యం రావడం వలన మిల్లుల వద్ద రద్దీ ఏర్పడిందని, తేమశాతంలో గందరగోళ పరిస్థితులు, సమస్యలు ఏర్పడ్డాయన్నారు. దీనిపై మిల్లర్లతో బుధవారం సమావేశం ఏర్పాటు చేసి వారికి సూచనలు ఇవ్వడం జరిగింది అన్నారు. ధాన్యం సేకరణ ప్రారంభమైనప్పటినుండి రాష్ట్ర పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లాలో ఇప్పటికే రెండుసార్లు పర్యటించారని, బుధవారం అవనిగడ్డ ప్రాంతంలో పర్యటించి రైతులు సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నదన్నారు. ఈ సమావేశంలో డీఆర్ఓ కె. చంద్రశేఖర రావు, మిల్లర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

కష్టాలు, సమస్యలను విన్నవించారు. ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించిన మంత్రి నారా లోకేష్.. పలు సమస్యల పరిష్కారానికి అప్పటికప్పుడే సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు అన్ని విధాల అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థలో 19 ఏళ్లుగా అవుట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న ఐటీ, మేనేజర్, ఏఈ, ఎంబీసీ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డీఈఓ, అటెండర్ల సర్వీసును గుర్తించి కాంట్రాక్ట్ బేసిక్ విధానంలోకి మార్చాలని ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఐటీఐ సివిల్ కలిగి వర్క్ ఇన్‌స్పెక్టర్లుగా పనిచేస్తున్న వారిని ఖాళీగా ఉన్న ఏఈ పోస్టుల్లో మండల ఇంఛార్జ్‌లుగా నియమించాలని కోరారు. కొంతమంది దళారులు గిరిజనులను తప్పుదోవ పట్టించారని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.

సమస్యల పరిష్కారం లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు

కమీషనర్ జి.జయలక్ష్మిలు జిల్లా కలెక్టర్లతో బుధవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ నుండి వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నిర్వహించనున్న రెవెన్యూ సదస్సుల గురించి వివరిస్తూ ఈనెల 6వ తేదీ నుండి ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభం కానున్న రెవెన్యూ సదస్సులను విజయవంతంగా నిర్వహించి ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో 320 రెవెన్యూ గ్రామ పంచాయతీల పరిధితో పాటు విజయవాడ, నందిగామ, జగ్గయ్యపేట, ఇబ్రహీంపట్నం, తిరువూరు పట్టణ వార్డు సచివాలయ పరిధిలో ఈనెల 6వ తేదీన రెవెన్యూ సదస్సులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జేసీ డా.నిధిమీనా, డీఆర్వో లక్ష్మీ నరసింహం, కలెక్టరేట్ సమన్వయ పర్యవేక్షకులు రామకృష్ణ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై 9, 10న నిరసనలు

మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ పిలుపులో భాగంగా నిర్వహించే నిరసన కార్యక్రమాలతో పాటు 10వ తేదీన డిమాండ్స్ డే ప్రకటిస్తున్నట్లు వెల్లడించారు. భారత కమ్యునిస్టు పార్టీ డిసెంబర్ 26వ తేదీ వంద సంవత్సరాల్లోకి అడుగుపెడుతున్న సందర్భంగా పార్టీ శ్రేణులు శత వార్షికోత్సవాలు వాడవాడలా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. సభ్యత్వ నమోదు రెన్యువల్‌ను పూర్తి చేయాలని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో సీపీఐ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, సీపీఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబురావు, ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి దాసరి వరహాలు, మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, ఏఐవైఎఫ్ జిల్లా ఇన్‌చార్జి షేక్ సుభాని, నాయకులు కందిమళ్ల నాగేశ్వరావు, చౌటుపల్లి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

షెల్టర్లు ఏర్పాటు చేయాలి

నిర్వహించారు. భారీ వర్షాలు, వరదలు, నదులకు వరద ముంపు తదితర విపత్తుల సమయంలో ప్రజల రక్షణకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త, సహాయక కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేసేలా రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖను బలోపేతం చేయటానికి తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి సమీక్షించి సూచనలు జారీ చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో గుంటూరు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ నాగలక్ష్మి, జిల్లా విపత్తుల నిర్వహణ ప్రాజెక్టు మేనేజరు లక్ష్మీకుమారితో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కృష్ణానదికి వరదలు వచ్చినప్పుడు జిల్లాలోని లంక గ్రామాల్లో ప్రజలు రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేసినా, జిల్లా యంత్రాంగం హెచ్చరించినా గ్రామాల్లో పశువులను వదిలి పునరావస కేంద్రాలకు రావటానికి ఆసక్తి చూపటం లేదన్నారు. జిల్లాలో పడవల లభ్యత తక్కువుగా ఉందని, వివిధ అవసరాలకు పడవలు వినియోగించేవారికి డ్రైవర్ లైసెన్సులు, పడవల కొనుగోలుకు నిబంధనల మేరకు అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ హోం మంత్రికు వివరించారు.

ఆర్టీసీ లైసెన్స్ కూలీల విశ్రాంత గది పునః ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీ లైసెన్స్ కూలీల రాష్ట్ర కార్యాలయంలో విశ్రాంత గదిని ప్రారంభించడం సంతోషకరమని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకటసుబ్బయ్య అన్నారు. స్థానిక పండిట్ నెహ్రూ బస్టాండ్ ఆవరణలో ఎప్పటినుంచో పాతబడిపోయిన విశ్రాంత గదిని ఇటీవల ఆర్టీసీ అధికారుల సహకారంతో మరమ్మత్తులు చేసుకొని చాలా చక్కగా తీర్చిదిద్ది బుధవారం ఏపీ పీటీడీ ఏటీఎం ద్వారా ప్రారంభించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ఎస్ వెంకటసుబ్బయ్య, ఆర్టీసీ అధికారులు మోదిన్, గుంజాగోపాలంతో పాటు యూనియన్ సీనియర్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సభలో నాయకులు మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన లైసెన్స్ కూలీల యూనియన్ అనేక పోరాటాలు ఉద్యమాలు సాగించి లైసెన్స్ కూలీలకు అనేక విధాలుగా సౌకర్యాలు సాధించి అండగా నిలుస్తుందన్నారు. ఏఐటీయూసీ నిర్వహించే అన్ని రకాల పోరాటాలలో లైసెన్స్ కూలీలు పాల్గొంటున్నారని చెప్పారు. ఏటీఎం శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ లైసెన్స్ కూలీలు ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని ఇందుకు సంవత్సరానికి 425 రూపాయలు మాత్రమే కట్టాల్సి ఉందన్నారు. ప్రతి ఒక్కరికి ఇన్సూరెన్స్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఎవరికైనా ఆరోగ్యం బాగోలేకపోయినా, లేదా చనిపోతే10 లక్షల వరకు ఇన్సూరెన్స్ కవర్ ఉంటుందన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి వేముల రాంబాబు మాట్లాడుతూ కార్మికులు ఎంతో కష్టపడి నిర్మించుకున్న ఈ విశ్రాంత గది కోసం ఆర్టీసీ అధికారులు బాగా సహకరించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం గుంజ గోపాలం మాట్లాడుతూ నాసర్‌వలి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రామ్మోహన్ రావు, భక్తుల వెంకటేశ్వర్లుతో కలిసి ఈ విశ్రాంత గదిని సాధించామని గుర్తు చేశారు. ఆనాటి ఆర్ఎం వై.విజయకుమార్ తమకు గది కేటాయించి ఆయన చేతుల మీదుగా మొదటగా ప్రారంభించారని ఈనాడు తిరిగి మంచిగా తయారు చేసుకొని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. జీవితం ఉన్నంతవరకు కార్మికుల కోసం పనిచేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కోశాధికారి వేముల వాసు, మేస్త్రీలు గుంజ వాసు, దుండగల శ్రీను, రమేషు, సురేషు, కోటేశ్వరరావు, కొండ తదితరులు పాల్గొన్నారు.

డీవీఆర్ హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా వేపూరి

విశాలాంధ్ర-నందిగామ: దేవినేని వెంకటరమణ ఏరియా హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా వేపూరి నాగేశ్వరరావు కమిటీ సభ్యులతో కలిసి కూటమి నాయకుల సమక్షంలో బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, జనసేన నియోజకవర్గ కన్వీనర్ తంబళ్లపల్లి రమాదేవి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ తొర్లికొండ సీతారామయ్య, జిల్లా నాయకులు రమేష్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా అభివృద్ధి కమిటీ చైర్మన్ గా ఎన్నికైన వేపూరి నాగేశ్వరావు మాట్లాడుతూ దేవినేని వెంకటరమణ ఏరియా హాస్పిటల్ అభివృద్ధికి స్థానిక కూటమినేతలతో కలిసి కమిటీ సభ్యులను ఏకతాటిపై నడిపిస్తానని, ఉద్యోగులు ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరిపి ఏరియా హాస్పిటల్ అభివృద్ధికి నడుం బిగించి పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సహధ్యక్షులుగా వ్యవహరించిన టీడీపీ సీనియర్ నాయకులు కోటా వీరబాబు నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిగామ దేవినేని వెంకటరమణ ఏరియా హాస్పిటల్ సూపరిండెంట్ సత్యనారాయణ,మున్సిపల్ కమిషనర్ రమణ బాబు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు విరివిగా పాల్గొన్నారు.

విశ్రాంత న్యాయమూర్తి సత్యనారాయణ రెడ్డి మృతి

విశాలాంధ్ర-విజయవాడ: కృష్ణాజిల్లా విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి దుగ్గిరాల సత్యనారాయణ రెడ్డి (85) బుధవారం స్థానిక జయప్రకాష్ నగర్‌లోని తన స్వగృహం నందు మరణించారు. ఉమ్మడి కృష్ణాజిల్లా విజయవాడ ప్రాంతంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య ఉద్యమాలతో ఆయనకు అనుబంధం ఉంది. గుంటూరు జిల్లా గురజాల మండలం అంబాపురంలో జన్మించిన ఆయనకు భార్య ఒక కుమారుడు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పదవీ విరమణ తర్వాత హక్కుల ఉద్యమాలు ఇస్కఫ్, శాంతి స్నేహ ఉద్యమంలో చురుగ్గా పాల్గొనేవారు. పెన్షనర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడుగా కూడా ఉన్నారు. వినియోగ దారుల కోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహించారు. గుజరాత్‌లో గోద్రా దుర్ఘటన సమయంలో ప్రజల్ని చైతన్య పరిచేందుకు కృషి చేశారు. జడ్జిగా ఉన్న రోజుల్లో పెండింగ్‌లో ఉన్న అనేక కేసుల సత్వర పరిష్కారం కోసం లోక్ అదాలత్ ఏర్పాటు చేసి ఒక్కరోజులోనే 350 కేసులు పరిష్కరించారు. ఆదివాసీలు, గిరిజనుల హక్కుల కోసం గ్రామ స్థాయిలో సత్వర న్యాయం జరగాలని ఆకాంక్షిస్తూ బీడీ శర్మ ఉద్యమం మాదిరిగా 'మన ఊరు- మన రాజ్యం' కావాలని కోరుకునేవారు. సత్యనారాయణ రెడ్డి మరణ వార్త తెలిసిన వెంటనే పలువురు వామపక్ష నాయకులు న్యాయవాదులు, సాహితీ వేత్తలు సందర్శించి నివాళులు అర్పించారు. పెన్షనర్స్ సంఘం నాయకులు దాలినాయుడు, నరసింహారెడ్డి, బ్రహ్మం, సాహితీ ప్రముఖులు తాటీ శ్రీకృష్ణ, గోళ్ళ నారాయణరావు, లక్ష్మయ్య, మోతుకూరి వెంకటేశ్వరరావు, అరుణ కుమార్, ఎంఎల్ పార్టీ నాయకులు వీర బాబు, రఘు, జగన్, ఏం వి ఆంజనేయులు తదితరులు నివాళులు అర్పించారు. ఆయనతో ఉన్న ఉద్యమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సాయంత్రం సత్యనారాయణ రెడ్డి అంత్య క్రియలు జరిగాయి.

ద్విచక్రవాహనాల చోరీ కేసుల్లో ఇద్దరి అరెస్టు

ఆరు బైక్స్, ఐ ఫోన్ స్వాధీనం

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): ద్విచక్రవాహనాల దొంగను సీసీయస్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ.3.5లక్షల విలువైన ఆరు ద్విచక్రవాహనాలు, ఒక ఐ ఫోన్ను స్వాధీనం చేసుకున్నారు. కానూరుకు చెందిన దోలవన్ సాయి తేజ(25), పెనమలూరుకు చెందిన వంగ కిషోర్ (19) పై పలు దొంగతనాల కేసులు ఉన్నాయి. పలు మార్లు జైలు జీవితం గడిపాడు. గంజాయి, మద్యంకు అలవాటుపడి ద్విచక్రవాహనాలకు చోరీలకు పాల్పడుతున్నారు. భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలో 2, టూటౌన్ పోలీస్ స్టేషన్ 1, సూర్యారావుపేట 1, గన్నవరం 1, గుంటూరు జిల్లా మంగళగిరి 1, పటమట 1, ఒక ఐ ఫోన్ చోరీ చేశారు. క్రైమ్ ఏసీపీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సీసీయస్ సీఐ ఎన్‌వీవీ లక్ష్మీ నారాయణ, భవానీపురం సీఐ ఉమామహేశ్వరరావు వారి సిబ్బందితో ఇద్దరిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి ఆరు బైక్స్, ఓ ఐ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీలు

2845 వాహనాలు తనిఖీలు, నెంబర్ ప్లేట్‌లేని 525 వాహనాలు సీజ్

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్వీ.రాజశేఖర బాబు ఆదేశాల మేరకు బుధ వారం సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 7గంటల వరకు అన్ని ప్రాంతాల్లోనూ ఏకకాలంగా విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. గంజాయి, మత్తుపదార్థాలు, చైన్స్ స్నాచింగ్స్ నివారించేందుకు ఈ తనిఖీలు చేపట్టారు. అతి వేగంగా ప్రయాణించే ద్విచక్రవాహనదారులను, శబ్ద కాలుష్యాన్ని సృష్టించే ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను కలిగి ఉన్న వాహనాలను వెంటనే గుర్తించి ఆ సైలెన్సర్లను తొలగించారు. హెల్మెట్ ఖచ్చితంగా ధరించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్సు, ఇన్సూరెన్సు, వాహనాలకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ ఇబ్బందితో కలిసి 45 బృందాలుగా ఏర్పడి నగరంలోని ముఖ్యమైన ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించారు. మొత్తం 2845 వాహనాలు తనిఖీ చేయగా, సరైన రికార్డ్స్, నెంబర్ ప్లేట్స్ లేని 525 వాహనాలను సీజ్ చేశారు. నిబంధనలకు ఉల్లంఘించిన వాహనాలకు రూ.11,800 జరిమానా విధించారు. ఈ తనిఖీల్లో ఏసీపీలు, లా అండ్ ఆర్డర్ సీఐలు, ట్రాఫిక్ సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తాం

ఒకే కలరు ఇస్తామని, వేతనంతో కూడిన మెడికల్ లీవు, వేసవి సెలవులు, ఇచ్చారని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకులు క్రమంగా రాకపోటం బీఎల్ఓ విధులు, అన్ని అంశాలు చర్చించటం జరిగిందన్నారు. సానుకూలంగా చర్చించిన డైరెక్టరు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ మూడు సంఘాలు తరుపున ధన్యవాదాలు తెలిపారు. ఈ చర్చల్లో ఏఐటీయూసీ సంఘం నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే.లలితమ్మ, సీఐటీయూ నుండి కె. సుబ్బరావమ్మ, జి. బేబీ రాణి, ఎన్ఎస్‌హెచ్.సుప్రజ, లక్ష్మీదేవి, షీబా, ఐఎఫ్‌టీయూ నుండి భారతి, జ్యోతి, వెంకటరత్న, శోభ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి : సీఐ

విశాలాంధ్ర-చల్లపల్లి : విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని చల్లపల్లి సిఐ కె. ఈశ్వర రావు సూచించారు. శ్రీ చైతన్య స్కూల్ ఆధ్వర్యంలో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం లో భాగంగా విద్యార్థుల చే సేఫ్ ఇండియా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఈశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, డిజిటల్ అరెస్టుల గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు వీటిపై అవగాహన కలిగించాలని సూచించారు. సీఐ ఈశ్వరరావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పిఎస్వి సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపల్ డి.సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

నంబర్ ప్లేట్ లేని వాహనాలు సీజ్

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : ఎన్టీఆర్ జిల్లా సిపి రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు అడిషనల్ సీపీ (ట్రాఫిక్) ప్రసన్న కుమార్, ఏసీపీ తిలక్, జగ్గయ్యపేట సిఐ వెంకటేశ్వరరావు నందిగామ ట్రాఫిక్ సిఐ సతీష్ ల పర్యవేక్షణలో బుధవారం జగ్గయ్యపేట పట్టణ పరిధిలో వాహనాలు తనిఖీ నిర్వహించి నెంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనాలు సీజ్ చేసారు.

తనిఖీలు నిర్వహించిన ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు

వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా నెంబర్ ప్లేట్ కలిగి ఉండాలని మరియు నెంబర్ ప్లేట్ లేని వెహికల్స్ నడపటం చట్ట రీత్యా నేరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ నాగేశ్వరావు, హెడ్ కానిస్టేబుల్ ఏడుకొండలు సుబ్బారెడ్డి మరియు ట్రాఫిక్ సిబ్బంది వెంకటేశ్వరరావు నాగేంద్ర నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలను పాటించాలి

విశాలాంధ్ర-వీరులపాడు: వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు తమ వెంట సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని వీరులపాడు ఎస్సై జి అనిల్ తెలిపారు. సాధారణ తనిఖీల్లో భాగంగా మండల కేంద్రం జుజ్జూరులో బుధవారం తమ సిబ్బందితో కలిపి వాహనాల తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా తమ వెంట సరైన ధ్రువపత్రాలను కలిగి ఉండాలని, నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించి నిబంధనలను అతిక్రమిస్తే చట్ట ప్రకారం ఉన్న అపరాధ రుసుములు శిక్షలు గురించి వివరించారు.

టిప్పర్ ఢీకొని యువకుడు మృతి

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): టిప్పర్ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం విజయవాడ టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తుమ్మపాల హేమంత్ చరణ్(27) డిప్లమో పూర్తి చేసి పైపుల రోడ్డులోని ఓ రెస్టారెంట్లో పని చేస్తున్నాడు. ఇతని ఇంకా వివాహం కాలేదు. ఉదయం 10గంటల సమయంలో స్నేహితుడి అక్కకు క్యారేజ్ ఇచ్చేందుకు తన బైక్ పై వైఎస్సార్ కాలనీ నుంచి పాముల కాలువ వైపు వెళ్తున్న సమయంలో అంబాపురం వెళ్తున్న టిప్పర్ లారీ వెనుక నుండి ఢీకొట్టి పొట్టభాగం పై లారీ చక్రాలు ఎక్కిదిగడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ప్రమాదం దృశ్యాలు సీసీ పుటేజీలో రికార్డ్ అయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరుకూరికి ద్రోణాచార్య అవార్డు ఇవ్వాలి

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్రప్రదేశ్లో ఆర్చరీ క్రీడను ఉనికిలోకి తీసుకువచ్చి వందలాది పతకాలను రాష్ట్రానికి అందించిన గురువు చెరుకూరి సత్యనారాయణకి ద్రోణాచార్య అవార్డ్ ఇచ్చి గౌరవించాలని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ కోరారు. స్థానిక మాచవరం శాతవాహన కళాశాల ప్రాంగణంలో బుధవారం జరిగిన 20వ రాష్ట్రస్థాయి కాంపౌండ్ ఆర్చరీ పోటీలను ఆయన ప్రారంభించారు. ముందుగా అంతర్జాతీయ మాజీ కోచ్ చెరుకూరి లెనిన్ చిత్రపటానికి పూలమాలలు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలలో రాజకీయాలు చేయటం మానుకోవాలని, క్రీడలను క్రీడలుగా గుర్తించాలన్నారు. దేశానికి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చే క్రీడలకు ప్రాముఖ్యత కల్పించి క్రీడాకారులను ప్రోత్సహించాలని కోరారు. ఎంతో వ్యయ ప్రయాసలతో కూడిన ఆర్చరీ క్రీడను అభివృద్ధి చేసేందుకు, ఎంతోమంది క్రీడాకారులను వెలికి తీసుకువచ్చిన వోల్గా ఆర్చరీ అకాడమీకి ప్రభుత్వాలు ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని కోరారు. చెరుకూరి సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 3, 4, 5తేదీలలో జరుగుతున్న ఈ పోటీలలో విజయం సాధించినవారు 15 నుండి 20వ తేదీ వరకు జంషెడ్ పూర్లో జరుగుతున్న జాతీయ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. జాతీయ పోటీలలో టాప్ 8 సాధించిన టీమ్లను ఫిబ్రవరి నెలలో ఉత్తరాఖండ్లో జరుగుతున్న జాతీయ క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కృష్ణాజిల్లా ఆర్చరీ అసోసియేషన్ కోశాధికారి గొట్టిపాటి ప్రేమ్ కుమార్, జాతీయ ఆర్చరీ జడ్జి బొమ్మ దేవర శ్రవణ్ కుమార్, సాంకేతిక అధికారి బెవర వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

సఫాయి కార్మికులకు జీతాలు చెల్లించాలి

విశాలాంధ్ర - గుడివాడ : 3 నెలల నుండి జీతాలు చెల్లించకుండా ప్రభుత్వ ఏరియా అసుపత్రి మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ శానిటేషన్ సఫాయి మహిళా కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలని గుడివాడ నియోజకవర్గ ఏఐటియుసి నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు గుడపాటి ప్రకాష్బాబు, కర్యదర్శి చింతలూరి సత్యానారాయణలు డిమాండ్ చేశారు. బుధవారం అన్నే నరసింహారావు ప్రభుత్వ ఏరియా అసుపత్రి వద్ద ఏఐటియుసి అనుబంధ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ శానిటేషన్ సఫాయి మహిళా కార్మికుల 3నెల జీతాలు చెల్లించాలని కోరుతూ 2వ రోజు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటియుసి గుడివాడ నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు గుడపాటి ప్రకాష్బాబు, కర్యదర్శి చింతలూరి సత్యానారాయణలు మాట్లాడుతూ శానిటేషన్ కాంట్రాక్టర్ 3నెల నుండి జీతాలు చెల్లించకుండ ఉద్యోగులు చేయిచడం దారుణమన్నారు. పిఎఫ్ల విషయంలో కూడ శానిటేషన్ సిబ్బందిని మోసం చేసిన కాంట్రక్టర్పై చర్యలు తీసుకోవలన్నారు. ప్రభుత్వం వెంటనే సఫాయి కార్మికులకు జీతాలు చెల్లించేల చర్యలు తీసుకోవలన్నారు. ఈ నిరసనలలో వడ్డాది రమణమ్మ, కనుమూరి విజలక్ష్మీ, వెల్పూల ధనలక్ష్మీ, మాతంగి మేరిమ్మ, దొండపాటి పద్మవతి, కోటేశ్వరమ్మ, థెరేజమ్మ, మణిమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల జీవితాలతో చెలగాటం

విశాలాంధ్ర-విజయవాడ (వన్టౌన్): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్లు వలంటీర్ల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఏపీ వలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లంక గోవిందరాజులు, రాష్ట్ర కార్యదర్శి జి.మమత అన్నారు. విజయవాడ పంజాసెంటర్లోని లోటేపోటే బాబా దర్గా ప్రాంగణంలో వలంటీర్లు తన ఉద్యోగాలు తమకు ఇప్పించాలని, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మనస్సు మారాలని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు వలంటీర్ల వ్యవస్థ కొనసాగిస్తామని, రూ.10వేలు గౌరవ వేతనం ఇస్తామని హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీని నెరవేర్చాలని చెప్పారు. ఇటీవల జరిగిన శాసన మండలి సమావేశాల్లో వలంటీర్ల వ్యవస్థ లేదని రాష్ట్ర రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల వీరాజనేయస్వామి ప్రకటించడం విచిత్రంగా ఉందన్నారు. అప్పటి రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రజలకు వలంటీర్లు వారధిగా పనిచేసారని చెప్పారు. కరోనా సమయంలో ఆరోగ్యాన్ని సైతం లెక్క చేయకుండా అప్పటి సీఎం జగన్ ఆదేశాలతో పార్టీలతో సంబంధం లేకుండా ప్రజలకు సేవలందించారని గుర్తు చేశారు. వలంటీర్లకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నెలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం 2,60,000 మంది వలంటీర్లకు న్యాయం చేయాలన్నారు. వారికి ఉద్యోగ భద్రత కల్పిస్తూ ప్రభుత్వ వెంటనే జీవో విడుదల చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజకుమార్, దమ్ము రమేష్, అబుల్జాలిని, పూజిత, ఆశ జ్యోతి, కల్యాణి, సోని, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : దక్షిణ మధ్య రైల్వేలో కార్మిక సంఘాలకు గుర్తింపు ఎన్నికలు బుధవారం డివిజన్ వ్యాప్తంగా అత్యంత కోలాహలంగా ఉదయం 8 గంటలకు ప్రారంభం అయ్యాయి.ఈ ఎన్నికలు గురు,శుక్రవారం కుడా కొనసాగనున్నాయి. 4.5 గుర్తింపు ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని హోరాహోరీగా ప్రచారం నిర్వహించాయి. 2013 తరువాత రైల్వేలో కార్మిక సంఘాలకు ఇప్పుడు ఎన్నికలు జరుగుతున్నాయి.ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే పోలింగ్ సాయంత్రం 5 గంటలకు ముగుస్తుంది. ఓటు హక్కు వినియోగించుకునేందుకు పెద్దఎత్తున ఉద్యోగులు,కార్మికులు పోలింగ్ బూత్లకు తరలి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. విజయవాడలో 9 ,రాయనపాడు వర్క్ షాపు లో మూడు పోలింగ్ బూత్ లను ఏర్పాటు చేశారు.డివిజన్ వ్యాప్తంగా 17,891 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోవలసి ఉంది,మొదటి రోజు సాయంత్రం 6 గంటలు వరకు పోలింగ్ నిర్వహించారు.ఎంతశాతం అనేది అధికారులు స్పష్టం చేయటం లేదు.అయితే యూనియన్ నాయకులు మాత్రం 50 శాతం పోలింగ్ నమోదు అయ్యిందని చేపుతున్నారు.ఈ ఎన్నికలకు ఏడిఆర్ఎం (ఇన్ఫ్రాస్ట్రక్చర్) పి.ఇ.ఎడ్విన్ రిటర్నింగ్ అధికారిగా, డివిజనల్ సీనియర్ పర్సనల్ అధికారి (సీనియర్ డిపిఒ) కట్టా ఆనంద్ సహాయక అధికారిగా వ్యహరిస్తున్నారు.డివిజన్ వ్యాప్తంగా గత 20 రోజుల నుంచి ప్రధాన కార్మిక సంఘాలైన సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్, సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూరీర్ యూనియన్, డీఎంఆర్ కేవిస్ రైల్వే మజ్దూరీర్ సంఘ్ హోరాహోరీగా ప్రచార ఫ్లెక్సీలు ప్రచారం నిర్వహించాయి. సంఘ్ జనరల్ సెక్రటరీ మర్రి రాఘవయ్య మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ శంకరరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రధానంగా సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్, సౌత్సెంట్రల్ రైల్వే మద్దూర్ యూనియన్ ల మధ్య తీవ్ర పోటీ నెలకొన్నట్లు తెలుస్తోంది. గతంలో ఈ రెండు సంఘాల మధ్య పోటీ ఉండేది.ఇప్పటికీ ఇదే కొనసాగుతుంది.ఈ ఎన్నికల్లో కార్మిక సంఘాలకు 30 శాతం ఓటింగ్ దాటితే ఆ కార్మిక సంఘానికి గుర్తింపు లభిస్తుంది. ఈనెల 12న ఫలితాలు ప్రకటించనున్నారు.అందుకు అనుగుణంగా రైల్వే ఆడిటోరియంలో పటిష్టమైన ఏర్పాటు చేశారు.అంతేకాకుండా డివిజన్ వ్యాప్తంగా ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల తీరును సిసి టివిలతో అధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు.ఎక్కడా ఎటువంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా ఆర్పీఎఫ్ ఉన్నతాధికారులు పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టారు.

BEFORE THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL AT NANDIGAMA

M.V.O.P.No. 12/2024

Between :
Aurangabad Sudha Rani and others ... Petitioners
And
Pattem Anil Kumar and another ... Respondents

To, R1: Pattem Anil Kumar, S/o Narasimha Rao, Hindu, aged 45 years, Properties, Owner of the Lorry **AP 39 UH 7959,** Door No. 1-248/1, Undavalli Village, Thadepalli Mandal, Guntur District and JCJC.

Please take notice that the above named petitioners got filed the above M.V.O.P. for compensation against you and others and the same stands posted to **13-12-2024** for your appearance.

Therefore you are hereby directed by this notice to attend before this Court on the said date at **10.30 a.m.**, either in person or through your advocate to answer the claim. Else, the matter will be decided in your absence.

(BY ORDER OF THE COURT)

Sd/- KONKIMALLA KRISHNA RAO
Advocate Jaggaiahpet
Cell : 98482 74420

విస్సన్నపేటలో రేషన్‌బియ్యం రగడ

-దుకాణాలపై దాడులంటూ అధికారుల ప్రకటన
-ప్రైవేటు స్థలాల్లో దాచారంటూ స్థానికుల ఫిర్యాదు

దాడిలో పట్టుబడిన బియ్యం చూపుతున్న అధికారులు, స్థానికుల నుంచి వివరాలు సేకరిస్తున్న రెవిన్యూ సిబ్బంది

విశాలాంధ్ర, విస్సన్నపేట : రాష్ట్రవ్యాప్తంగా కాకినాడ పోర్టు నుంచి ఎగుమతి జరుగుతున్న రేషన్ బియ్యంపై చర్చ జరుగుతుండగా, ఇదే అంశం బుధవారం రాత్రి విస్సన్నపేటలో అధికారులు, స్థానికుల మధ్య హైడ్రామాకు తెరలేపింది. వివరాల్లోకి వెళితే...విస్సన్నపేట పంచాయతీలోని రెండు రేషన్‌దుకాణాలపై పీడీఎస్ అధికారులు బుధవారం రాత్రి ఆకస్మిక దాడి చేసి, అదనంగా ఉన్న సుమారు 78 క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించారు. దుకాణాల డీలర్లు పలగాని నాగమణి, ఆకుల శ్రీనివాసరావులపై కేసులు నమోదు చేస్తున్నట్లు పీడీఎస్ డిప్యూటీ తహశీల్దారు శివనాగరాజు, వీఆర్వో పవన్‌కుమార్‌లు ప్రకటించారు. కొద్దిసేపటికే ఆయా డీలర్లు పెద్దఎత్తున బియ్యాన్ని ఒక ప్రైవేటు గృహంలో దాచగా, గుర్తించామంటూ స్థానికులు సదరు ఇంటి వద్ద ఆందోళనకు దిగారు. స్థానిక ప్రముఖులు గుత్తా శివసుబ్రహ్మణ్యం, నిగమాను సూరిబాబు తదితరులు అక్కడికి చేరుకోగా, గృహంలో నివసించేవారు ఇంటికి తాళం వేసి, వెళ్లిపోయారు. అధికారులు, రేషన్‌డీలర్లు ఒక్కటై పెద్దఎత్తున బియ్యాన్ని సదరు గృహంలో దాచిపెట్టి, దాడులు చేస్తున్నట్లు డ్రామాలు ఆడుతున్నారంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో శివసుబ్రహ్మణ్యం, సూరిబాబు తదితరులు రెవిన్యూ, పోలీసు, పౌరసరఫరాలశాఖ అధికారులకు మంగళవారం రాత్రి ఫిర్యాదు చేయగా, బుధవారం సాయంత్రం వరకు వారు స్పందించకపోవటం అనుమానాలకు తావిచ్చింది. అప్పటివరకు విస్సన్నపేటలో దాడులు చేశామని చెప్పిన పీడీఎస్ అధికారులు తాము విజయవాడలో ఉన్నామంటూ సమాధానం ఇవ్వగా, పోలీసు, రెవిన్యూ అధికారులు కనీసం స్పందించలేదని వారు తెలిపారు. దీనిపై తిరువూరు ఆర్డీవో, సీఐలకు సైతం ఫిర్యాదు చేసిన కొద్దిసేపటికి రెవిన్యూ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని, స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. ఇంత జరిగినా, సదరు ఇంట్లో బియ్యం దాచిన విషయం వాస్తవమా, కాదా, ఉంటే ఎవరు దాచారనే విషయాలపై కనీస విచారణ చేపట్టకపోవటం పట్ల స్థానికుల ఆరోపణలకు బలం చేకూరుతోంది. కాకినాడ రేషన్ దందాకు చెందిన ఒక ఏజంటు స్థానిక నూజివీడు రోడ్డులోని ఒక గృహంలో అద్దెకు నివసిస్తూ, ఒక విస్సన్నపేటలో అధికారపార్టీకి చెందిన ఒక రేషన్ డీలర్ ద్వారా పెద్దఎత్తున దందా కొనసాగిస్తున్నారని, అధికారులు అండగా నిలుస్తున్నారని శివసుబ్రహ్మణ్యం, సూరిబాబు ఆరోపించారు.

చురుగ్గా ఎస్టీయూ సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర-మచిలీపట్నం : గుడ్లవల్లేరు మండలంలో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం రాష్ట్ర నాయకులు కొమ్ము ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం జరిగినది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీయూలో సభ్యత్వం పొందడం ప్రతి ఒక్కరు అదృష్టంగా భావించాలని, సభ్యత్వం తీసుకునేందుకు ముందుకు వస్తున్న వారికీ ధన్యవాదాలని ఆయన అన్నారు. 65 సభ్యత్వాలను నమోదు చేయించుకోవడం ఆనందాన్ని ఇచ్చిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ కృష్ణాజిల్లా ఫైనాన్స్ సెక్రటరీ కొణతం మాధవరావు, గుడ్లవల్లేరు మండల నాయకులు డి.రవిశంకర్, సుబ్రహ్మణ్యం, మహమ్మద్ రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల జయంతి

విశాలాంధ్ర-మచిలీపట్నం : ఘంటసాల వెంకటేశ్వరరావు గానామృతం జన్మజన్మలకు మరువలేనిది టీడీపీ రాష్ట్ర నాయకుడు, కొనకళ్ళ జగన్నాధరావు (బుల్లయ్య) అన్నారు. బుధవారం ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతి సందర్భంగా మచిలీపట్నం మెయిన్‌రోడ్డు ప్రధాన పార్కు ప్రక్కన ఉన్న ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ రాష్ట్ర నాయకుడు, కొనకళ్ళ జగన్నాధరావు (బుల్లయ్య) మీడియాతో మాట్లాడుతూ స్వర్గీయ ఘంటసాల వెంకటేశ్వరరావు ఎంత గొప్ప స్థితికి చేరుకున్న తనను ఆదరించిన వారిని మరువలేదు అని, ఘంటసాల ఎన్నడు మరొకరిని నొప్పించే వారు కాదని, కోరిన వారికి కాదనక సహాయం చేసిన గొప్ప మనసున్న వ్యక్తి స్వర్గీయ మన ఘంటసాల వెంకటేశ్వరరావు అన్నారు. మచిలీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజు మాట్లాడుతూ 100 చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించి, ఎనిమిది వేల పాటలకు పైగా వివిధ భాషలలో సినిమా పాటలు పాడి చరిత్ర సృష్టించిన మహనీయుడు ఘంటసాల అన్నారు. ఈ కార్యక్రమంలో రోల్డ్ గోల్డ్ అధినేత, జి. రామబ్రహ్మం, బిజెపి నాయకుడు, ధూళిపాళ్ల శ్రీరామచంద్రమూర్తి, ఎం. సుబ్రమణ్యం, తోట కామేశ్వరరావు, లంకి శెట్టి నీరజ, బదుగు ఉమాదేవి, వి ఎస్ ఎస్ ఆర్ శర్మ, డి ఎస్ ఆర్ సుశీలరావు, కొండా ప్రసాద్, బి. అయోధ్య రామయ్య తదితరులు పాల్గొన్నారు.

లంక గ్రామాల్లో పశువుల ఆశ్రయ నిర్మాణాలు : కలెక్టర్ బాలాజీ

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత క్యాంపస్ కార్యాలయం నుండి కలెక్టర్లతో విపత్తుల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ నుండి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతికూల వాతావరణం సమయంలో జిల్లా పరిధిలో కృష్ణానది పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న లంక గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నప్పటికి ప్రజలు ముందుకు రాలేదని తెలిపారు. కృష్ణాజిల్లా కలెక్టర్ మంచి సూచనలు చేశారని హోంమంత్రి అనిత అభినందిస్తూ ఈ సూచనల అమలుకు త్వరలో తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ కె. చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

10న జనసేవదళ్ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు

విశాలాంధ్ర-తిరువూరు: భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఏఐవైఎఫ్ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కే సుభాని అధ్యక్షతన బుధవారం సుంకర వీరభద్రరావు భవనంలో నియోజకవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య విచ్చేసిన ఏఐవైఎఫ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు లంక గోవిందరాజు మాట్లాడుతూ నందిగామలో డిసెంబర్ 10వ తారీఖున నుండి 14వ తారీకు వరకు నందిగామలో జనసేవాదళ్ రాష్ట్రస్థాయి శిక్షణా తరగతులకు హాజరుకావాలని అన్నారు.ఐదు రోజులపాటు జరిగే శిక్షణ తరగతులకు యువకులు,యువతులు,పిల్లలు హాజరు కావాలని అన్నారు. నియోజకవర్గ స్థాయిలో అన్ని మండలాల నుంచి పార్టీ సానుభూతిపరులు, కార్యకర్తలు హాజరుకావాలని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి మాలపాటి ఉదయ్, ఎస్ కే యాకోబు,ఎస్ కే భాష, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధికి చర్యలు : రవికుమార్



విశాలాంధ్ర-గుడివాడ : గ్రంథాలయ అభివృద్ధికి ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామని సంస్థ కార్యదర్శి వేములపల్లి రవికుమార్ అన్నారు. బుధవారం స్థానిక షా గులాబ్ చంద్ ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయాన్ని కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వేములపల్లి రవికుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షిక తనిఖీలో భాగంగా గ్రంథాలయంకు రావడం జరిగిందన్నారు. గ్రంథాలయ భవనం శిథిలావస్థలో ఉందన్నారు. దీనిని త్వరలోనే నిధులు మంజూర్ అయ్యేల కృషి చేస్తామన్నారు. గ్రంథాలయంలోని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బీరం వెంకటరమణ, సిబ్బంది టి.ప్రవల్లిక, పి.రవిచంద్ర, పాఠకులు పాల్గొన్నారు.

అత్యవసర నిధులతో రోడ్లకు మరమ్మతులు

విశాలాంధ్ర-పెదపారుపూడి : మండలంలోని యలమర్రు గ్రామం నుండి పామర్రు వెళ్ళు ఆర్ అండ్ బి రహదారిలో విద్యుత్ సబ్ స్టేషన్ వరకు సుమారు రెండు కిలోమీటర్లు రాష్ట్ర ప్రభుత్వ అత్యవసర నిధులు సుమారు రూ 80 లక్షలతో ప్రత్యేక మరమ్మతుల నిమిత్తం రోడ్డు నిర్మిస్తున్నట్లు ఆర్ అండ్ బి ఏ ఈ హరీష్ బుధవారం తెలిపారు.

విస్సన్నపేట వెలుగు ఏపీఎంపై ఫిర్యాదు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: వెలుగు విస్సన్నపేట ఏపీఎం జమలయ్యపై పలువురు ఏపీఎంలు జిల్లా కలెక్టర్‌ను కలిసి, నేరుగా ఫిర్యాదు చేశారు. మండల వెలుగు కార్యాలయంలో పెద్దఎత్తున అవినీతి జరిగిందని, దీనిపై ప్రశ్నిస్తున్న తమను నిర్దాక్షిణ్యంగా తొలగించి, కొత్తవారిని నియమించారని వారు కలెక్టర్ లక్ష్మీశకు తెలిపారు. తాము గత నెల 18వ తేదీన ఫిర్యాదు చేయగా, 20న డీఆర్డీయే అధికారులు విచారణ చేపట్టారని తెలిపారు.

రైతులు ఫెనల్ బీమా చేయించుకోవాలి

విశాలాంధ్ర-గన్నవరం : రైతులు రబీ పంటలకు బీమా తప్పని సరిగా చేయించాలి అనిఏ ఓ రజని అన్నారు. బుధవారం ముస్తాబాద్ మరియు సురంపల్లి గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన కింద రబీకి క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. జెడి ఏ పద్మావతి మచిలీపట్నం , ఏ డి ఏ సునీల్ గన్నవరం, యం ఏ ఓ రజనీ, వైఏస్‌లు రైతులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి మాటే మరిచిన ప్రభుత్వం : సింహాద్రి

విశాలాంధ్ర-అవనిగడ్డ : రాష్ట్ర కూటమి ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలతో కొనసాగుతుందని సంక్షేమ అభివృద్ధి మాటే మరిచిందని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. బుధవారం తన కార్యాలయంలో సింహాద్రితో మాట్లాడుతూ కూటమి అధినేతల మాదిరిగా దు ఎమ్మెల్యే మండలి ప్రసాద్ కూడా డైవర్షన్ రాజకీయాలు మొదలు పెట్టారని, నియోజకవర్గ సమస్యల గురించి అక్రమాల గురించి మాట్లాడుతుంటే మాపై తప్పుడు ఆరోపణ చేస్తున్నారన్నారు. డాక్టర్ శ్రీహరిరావు హత్యకేసులో నిందితులను తేల్చండి పత్రికల్లో వచ్చిన వార్తను సింహాద్రి ఖండించారు. నియోజకవర్గంలో సమస్యలు వదిలేసి ఫోటోలకు పాలాభిషేకాలు చేయించుకొని సింహాద్రి విమర్శించారు గత 20 సంవత్సరాలుగా నియోజకవర్గంలో ఎన్నో కేసులను రాజీ చేసిన సందర్భాలు ఉన్నాయని మండల హయాంలో ఎన్నో హత్యలు సెయించిన సంఘటనలు ఉన్నాయన్నారు ఏ కార్యక్రమంలో జడ్పిటిసి నారాయణ చింతలపూడి లక్ష్మీనారాయణ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు చింతలపూడి బాలు మండల కో ఆప్షన్ సభ్యులు రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి గాజుల జై గోపాల్ తుంగల అంకారావు, తదితరులు పాల్గొన్నారు.

మోహన్ రెడ్డిని పరామర్శించిన ప్రజానాట్యమండలి నాయకులు

విశాలాంధ్ర-మంగళగిరి : ప్రజానాట్యమండలి సీనియర్ సభ్యులు కల్లం మోహన్ రెడ్డిని ప్రజానాట్యమండలి నాయకులు బుధవారం పరామర్శించారు. మంగళగిరి మండలం నూతక్కి గ్రామంలో ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు కళ్ళం మోహన్ రెడ్డి అనారోగ్య కారణంగా విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయనను ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు, నాయకులు కంచర్ల కాశయ్య, సీపీఐ గ్రామ శాఖ కార్యదర్శి షేక్ మదీనా బాబు పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మోహన్ రెడ్డి పాత రోజుల్లోనే వందలాది నాటకాలలో నటించారని వారు కొనియాడారు.

సీసీఐ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-దాచేపల్లి : సీసీఐ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఏఓ పాపకుమారి రైతులను కోరారు. బుధవారం కేసానపల్లి, మాదినపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పొలాల్లో పత్తి, మిర్చి పంటలను సందర్శించిన ఆమె రైతులతో మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్ళాలని సూచించారు. క్వింటా పత్తి ధర రూ.7521లు లభిస్తున్నట్లు చెప్పారు.

ఆర్థిక నిపుణుడు కోణిజేటి రోశయ్య : ఏపీడీసీఐ చైర్మన్ డేగల

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక పట్టాభిపురంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 3వ వర్ధంతి కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఏపీఐడీసీ)చైర్మన్ డేగల ప్రభాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని కొణిజేటి రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డేగల ప్రభాకర్ మాట్లాడుతూ కొణిజేటి రోశయ్య గొప్ప పరిపాలనాదక్షుడుగా ఆర్థిక నిపుణుడిగా పేరు ప్రఖ్యాతులు గడించారని కొనియాడారు. విద్యార్థి సంఘ నాయకుడు నుంచి గవర్నర్ స్థాయికి అంచలంచలుగా ఎదిగారని ప్రశంసించారు. కొణిజేటి రోశయ్య చిత్రపటానికి నివాళులు అర్పించిన వారిలో టీడీపీ నాయకులు కోవెలమూడి నాని, కొనకళ్ళ సత్యం, సిటీ బస్సు బాబు తదితరులు ఉన్నారు.

బాలబాలికల నెట్‌బాల్ జట్ల ఎంపిక

విశాలాంధ్ర- తెనాలి : ఈ నెల 8వ తేదీన జిల్లా సబ్ జూని యర్ బాలబాలికల నెట్‌బాల్ జట్ల ఎంపిక జరగనున్నట్లు సంఘ కార్యదర్శి వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చెంచుపేటలోని ఎయస్ఎన్ ఇండోర్ స్టేడియం ఆవరణలో జరుగుతుందని, ఆసక్తి గల క్రీడాకారులు తమ వయస్సు ధృవీకరణపత్రం, ఆధార్, స్టడీ సర్టిఫికెట్‌తో హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు. 2008 తరువాత పుట్టినవారు అర్హులు అని చెప్పారు. పోటీలలో ఎంపికైన వారు ఈ నెల 14,15వ తేదీలలో రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. వివరాలకు నిర్వాహకులు డి.నాగ రాజు, జె.సుధాకర్ సెల్.9963334731, 9177167740 నెంబర్లకు సంప్రదించవలసిందిగా తెలిపారు.

ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో
ఏకపాత్రాభినయ, పాటల పోటీలు

విశాలాంధ్ర-మంగళగిరి : సీపీఐ శత వసంత కాలం పూర్తి చేసుకుం టున్న సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఏకపాత్రాభినయ పోటీలు, పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు, ఉపాధ్యక్షులు కంచర్ల కాశయ్య, సీనియర్ కళాకారులు సందుపట్ల భూపతిలు తెలిపారు. బుధవారం మంగళగిరి పట్టణంలోని వేములపల్లి శ్రీకృష్ణ భవన్ సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సీపీఐ ఈ నెల 26వ తేదీ నాటికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో వాడ వాడలా ఏకపాత్రాభినయ పోటీలు, పాటల పోటీలు నిర్వహించనున్నారన్నారు. ఆసక్తి గలవారు పాల్గొనాలని వారు పిలుపు నిచ్చారు. గుంటూరు జిల్లా వ్యాప్తంగా కళాకారులను ప్రోత్సహించే విధంగా ఈ నెల 8వ తేదీ ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు గుంటూరు కొత్తపేట సీపీఐ కార్యాల యంలో నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కళలు, సాహిత్యం పట్ల ఆసక్తిగల యువ కళాకారులు ఈ పోటీలో పాల్గొన వచ్చు నని వారు తెలియజేశారు. పోటీలో గెలిచిన కళాకారులకు మొదటి బహుమతి రూ.3 వేలు, రెండవ బహుమతి రూ.2 వేలు, బహుమతి రూ.1000లతో పాటు పోటీల్లో పాల్గొన్న ప్రతిఒక్కరికి ప్రశంసా పత్రాన్ని అందించడం జరుగుతుందని వారు అన్నారు. ఈ పోటీల్లో గెలిచిన విజేతలకు డిసెంబర్ నెల 16, 17వ తేదీలలో విజయవాడలో జరుగు రాష్ట్ర వ్యాప్త పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని వారు తెలిపారు.

మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యకు నివాళులు

విశాలాంధ్ర-తెనాలి : తెనాలి పట్టణంలో బుధవారం మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొణిజేటి రోశయ్య 3వ వర్ధంతి కార్యక్రమాలను విస్తృతంగా నిర్వ హించారు. తెనాలి ఎస్ఆర్కె & ఎస్ఆర్ గుప్తా డిగ్రీ కళా శాల ఆధ్వర్యంలో కాలేజీ ప్రాంగణంలో వర్ధంతి సభ జరిగి ంది. ఈ సభకు గుప్తా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గోగినేని విజయకృష్ణ నివాళులర్పిస్తూ ఆయన గుప్తా కళాశాలకు చేసిన సేవలను వివరించారు. కార్యక్రమంలో పొట్టి శ్రీరా ములు విద్యాసంస్థల మేనేజర్ డి.శ్రీనివాసరావు, అధ్యాప కులు ఎం.దశరధరామిరెడ్డి, షేక్ రఫీ, ఎ.బాలగోపాల్, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. తెనాలి పట్టణంలో రోశయ్య 3వ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మారీస్‌పేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు చందు సాంబశివుడు ఆయన జీవిత విశేషాలను వివరించారు. సభా ప్రారంభంలో ఆయన చిత్రపటానికి పూలమా లలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు. తెనాలి బోస్‌రోడ్డులోని కన్యకాపరమేశ్వరి దేవా లయం సంస్థ ఆధ్వర్యంలో అపర కర్మశాలలో రోశయ్య 3వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. కన్యకాపరమేశ్వరి దేవస్థానం నిర్వాహకులు రోశయ్య విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

6 నుంచి రెవెన్యూ సదస్సులు

విశాలాంధ్ర-రెంటచింతల : గ్రామస్థాయిలో భూ వివాదాలను పరిష్కరించేందుకు ఈ నెల 6 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. భూ వివాదాలను తగ్గించేందుకు రెవెన్యూ కౌన్సిల్‌లు ఉండాలని, ఆక్రమణలో భూములు కోల్పోయిన బాధితులను ఆదుకోవాలని స్పష్టం చేస్తూ ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహించాలని నిర్ణయించింది. రెవెన్యూ గ్రామ సదస్సుల్లో స్వీకరించే ఫిర్యాదులు/వినతులపై 45 రోజుల్లోగా పరిష్కార చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం అధికా రులను ఆదేశించింది. ఆ దిశగా ఆయా గ్రామాల్లో సదస్సులు నిర్వహించేందుకు రెవిన్యూ యంత్రాంగం సన్నా హాలు చేస్తోంది. ఈ మేరకు గ్రామ స్థాయిలో రెవెన్యూ సదస్సుల షెడ్యూల్ తహశీల్దార్ కె.నగేష్ వెల్లడించారు. ఈ నెల 6న మల్లవరం, 10న జెట్టిపాలెం, 12న పశర్లపాడు, 17న గోలి, 19న మిట్టగుడిపాడు, 21న రెంటచింతల, 24న రెంటాల, 26న మంచికల్లు, 28న పాల్వాయి, పాల్వాయి గేటు, 31న తుమ్మకోటలో ఆయా గ్రామ సచివాలయాలు వేదికగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ తెలిపారు. ఆర్టీజీఎస్ పోర్టల్ ద్వారా ప్రజల పిటీషన్లు, ఆర్జీలు తీసుకోనున్నారు. 22ఏలో ఉన్న భూముల తారుమారు, ఫ్రీ హోల్డ్, భూ ఆక్రమణలపై ఫిర్యాదులు స్వీకరించ నున్నారు. కాగా భూ సమస్యల పరిష్కారానికి ఎలాంటి రుసుము వసూలు చేయరాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. సదస్సులకు సంబంధించి బృందంలో తహశీల్దార్‌తో పాటు ఆర్ఐ, సంబంధిత గ్రామాల వీఆర్వో, మండల సర్వేయర్, దేవదాయ శాఖ అధికారి, రిజిస్ట్రేషన్, అటవీ భూము లకు సంబంధించి అధికారి, అవసరమైన చోట వక్ఫ్ బోర్డ్అధికారి పాల్గొంటారు.

7న మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్

విశాలాంధ్ర-నూజెండ్ల : ప్రభుత్వ, యాజమాన్య పాఠశాలల్లో ఈ నెల 7న పాఠశాల విద్యా వ్యవస్థకే అతి పెద్ద పండగ తల్లితండ్రుల ఉపాధ్యాయుల సమావేశాన్ని(మెగా పీటీఎం) నిర్వహించనున్నారని మండల విద్యాశాఖ అధికారి నలబోలు రవిచంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమావేశంలో ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, దాతలు, పాఠశాల పూర్వ విద్యార్థులు తదితరులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో విద్యార్థి విద్యా ప్రగతి, క్రీడా ప్రగతి, వ్యక్తిగత ఆరోగ్య అంశాలతో కూడిన హోలిస్టిక్ ప్రోగ్రెస్ రిపోర్ట్ పంపిణీ చేసి, విద్యార్థుల విద్యా ప్రగతి, క్రమశిక్షణ తదితర విషయాలను తల్లితండ్రులతో ఉపాధ్యాయులు వ్యక్తి గతంగా చర్చిస్తారని తెలిపారు. పాఠశాల పటిష్టత, విద్యార్థి వికాసం, సమస్యల పరిష్కారానికి సలహాలు తీసుకోవడం జరుగుతుందని పూర్వ విద్యార్థులను ఆహ్వానించి, వారి విజయ గాథలను విద్యార్థులకు వినిపిస్తారని ఆ తర్వాత విద్యార్థి తల్లులకు ముగ్గుల పోటీ, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ నిర్వహించి బహుమతులు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 9 గంటలకు మొదలై మధ్యాహ్నం ఒంటి గంటకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంతో ముగుస్తుందని తెలిపారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

విశాలాంధ్ర-తెనాలి : తెనాలి పట్టణంలో 23వ వార్డులో తెనాలి మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక విస్తృతంగా పర్యటించారు. అచట శానిటేషన్ పనులను పరిశీ లించారు. శానిటేషన్ సిబ్బం దికి సూచనలు ఇస్తూ నేడు జరుగుతున్నది చలికాలమని, ఈ కాలంలో శుభ్రతకు ప్రాముఖ్యత ఇవ్వాలని చెప్పారు. కార్మికులందరూ తమంతట తాము తమపనిగా భావించి వార్డులో శుభ్రంగా ఉండేటట్లు వార్డు ప్రజలకు కూడా శుభ్రత గురించి అవగాహన కలిగించాలని తెలిపారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి కార్మికులం దరికి ప్రతి రోజు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరి ంచారు. హెల్త్ ఆఫీసర్ హెలెన్ నిర్మల, సునీల్ కుమార్, సాంబశివరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన వికాస కార్యవర్గం

విశాలాంధ్ర-మంగళగిరి: ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని ఉద్యోగ సంఘం(వికాస) బుధవారం భాధ్యతలు స్వీకరించింది. వికాస భవన్‌లో జరిగిన కార్యక్రమంలో పూర్వ కార్యవర్గం నుంచి భాధ్యతలు తీసుకున్నారు. అనంతరం కార్యవర్గ సమావేశం నిర్వహి ంచారు. ఈ సమావేశంలో అజెండాపై చర్చించారు. మధ్యా హ్నం వీసీ ఆచార్య కె.గంగాధరరావు, రెక్టర్ ఆచార్య కె.రత్న షీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలంలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంలో అధికారులను సన్మానించారు. వర్సిటీ అభివృద్ధికి అవసరమైన మార్గదర్శకాలను అనుసరిం చాలని వికాస కార్యవర్గానికి వీసీ సూచించారు. అధ్యక్షుడు ఎన్. ప్రసాద్, ఉపాధ్యక్షుడు డి.విజయ్ ప్రకాష్, కార్యదర్శి జవ్వాజి శ్రీనివాసరావు, కోశాధికారి కె.యేసయ్య, సంయుక్త కార్య దర్శులు నేలపాటి నాగేశ్వరరావు, తోట వెంకటేష్, కార్యవర్గ సభ్యులు జి.శ్రీను, కె.శశిధర్, పి.నాగరాజు, ఎన్.వెంకటేశ్వర్లు, టంకశాల వెంకటేశ్వరరావు, సీహెచ్ సాంబశివరావు, చిమట ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అత్యంత వేగవంతమైన
స్మార్ట్‌ఫోన్ ఐక్యూ13 విడుదల

విశాలాంధ్ర-గుంటూరు: అధిక-పనితీరు గల స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ ఐక్యూ తాజాగా భారతదేశంలో అత్యంత వేగవంతమైన స్మార్ట్‌ఫోన్ ఐక్యూ 13ని విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఇది భారతదేశంలో క్వాల్కమ్ స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ చిప్‌సెట్‌తో అమర్చబడిన మొదటి స్మార్ట్‌ఫోన్లలో ఒకటి. ఐక్యూ 13 ధర 12జీబీ+256జీబీ వేరియంట్‌కు రూ.54,999 (సమర్థవంతమైనధర: రూ.51,999), 16జీబీ+512జీబీ వేరియంట్‌కు రూ.59,999 (సమర్థవంతమైన ధర: రూ.56,999). ఇది రెండు సొగసైన రంగులలో అందుబాటులో ఉంటుంది. అవి: లెజెండ్ మరియు నార్డో గ్రే. అదనంగా, ఐక్యూ 13 ప్రీ-బుకింగ్ డిసెంబర్ 05, మధ్యాహ్నం 12 గంటలకు అందుబాటులో ఉంటుంది. దాని మొదటి విక్రయం డిసెంబర్ 11, 2024 నుండి మధ్యాహ్నం 12 గంటలకు వివో ప్రత్యేకస్టోర్లు, ఐక్యూ ఇ-స్టోర్, అమెజాన్.ఇన్‌లలో ప్రారంభమవుతుంది. ఐక్యూ 13 వివో ఎక్స్‌క్లూజివ్ స్టోర్లు, ఇతర మెయిన్‌లైన్ స్టోర్లలో కూడా అందుబాటులో ఉంటుంది. ఈ విస్తరణ ఐక్యూ పరికరాలను అనుభవించే, కొనుగోలు చేసే సౌలభ్యాన్ని నిర్ధారిస్తుంది.

రేపటి నుంచి వజ్ర బాబు పర్యటన

విశాలాంధ్ర-తాడికొండ : వైసీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వ యకర్త వనమా వజ్రబాబు శుక్రవారం నుంచి ప్రజల్లోకి రాను న్నారు. ఉదయం 9 గంటలకు గుంటూరు నగరంలోని తన కార్యా ల యం నుంచి ర్యాలీగా తుళ్లూరు మండలం వెంకటపాలెం వెళ్ళ తారు. వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పేదలకు చీరలు పంపిణీ చేస్తారు. అన్నదానం జరుగుతుంది. అనంతరం గ్రామాలలో పర్యటిస్తారు. నియోజవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని బుధవారం తన కార్యాలయ ంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలియజేశారు.

మెప్మా అక్రమాలపై ఉక్కుపాదం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ఆర్పీలతో కలిసి బోగస్ గ్రూప్‌లను ఏర్పాటు చేసి లక్షలు దండుకున్న మెప్మా అధికారులను గుర్తించి శిక్షించబోతున్నాం అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హెచ్చరించారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆర్థిక చేయూత అందించడమే ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. మహిళా సంఘాల నిధుల విషయంలో ఇటీవల చాలా అక్రమాలు వెలుగు చూస్తున్నాయని మెప్మా అధికారుల అక్రమాలపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 5 సంవత్సరాల్లో భారీగా అక్రమాలు జరిగాయని, ఇందులో ఎవరెవరి పాత్ర ఉన్నదో గుర్తిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. అక్రమాలపై ఉక్కు పాదం మోపుతున్నామని తెలిపారు.

పన్ను కట్టకుంటే... ట్యాప్ కనెక్షన్ కట్

- నగర కమిషనర్ పులి శ్రీనివాసులు హెచ్చరిక

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు నగర పాలక సంస్థకు సకాలంలో పన్నులు చెల్లించని వారి నివాసాలు, వ్యాపార సంస్థలకు తొలుత ట్యాప్ కనెక్షన్లు తొలగిస్తామని, అప్పటికీ చెల్లించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టంచేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు నగరంలోని శ్రీనివాసరావు తోట, నల్లపాడు రోడ్, ఆదర్శ నగర్, నల్లచెరువు తదితర ప్రాంతాల్లో ఆస్తి, నీటి పన్నులు చెల్లించని నివాసాలకు, కమర్షియల్ సంస్థలకు మున్సిపల్ ట్యాప్ కనెక్షన్లను రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో ఇంజినీరింగ్ సిబ్బంది బుధవారం తొలగించారు. శ్రీనివాసరావు తోట, నల్లపాడు రోడ్, కేవీపీ కాలనీ, నల్ల చెరువులోని పలు నివాసాలు, కమర్షియల్ సంస్థలు ఆస్తి పన్నుబకాయిలు పెండింగ్‌లో ఉండడం, పలుమార్లు బకాయిల చెల్లింపు చేయాలని తెలిపినప్పటికీ చెల్లించని కారణంగా మున్సిపల్ ట్యాప్ కనెక్షన్లు తొలగించామని, విద్యుత్ కనెక్షన్, ఆర్‌ఆర్ యాక్ట్ మేరకు జప్తు కూడా చేస్తామని తెలిపారు. నల్లకుంట ఎదురు ఉన్న తాజ్ హోటల్‌కి అనధికారికంగాఉన్న మున్సిపల్ ట్యాప్‌ని కూడా తొలగించామన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో ఎస్టీఎఫ్‌ది కీలక భూమిక

- గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : శాంతిభద్రతల పరిరక్షణలో స్పెషల్ టాస్క్ ఫోర్స్(ఎస్‌టీఎఫ్)ది కీలక భూమిక అని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి అన్నారు. ఎస్‌టీఎఫ్ సిబ్బంది కోసం జిల్లా అదనపు ఎస్పీ (ఏఆర్) ఎ.హనుమంతు ఆధ్వర్యంలో నగరంపాలెం పోలీస్ స్టేషన్ పక్కన గల ఎస్‌టీఎఫ్ కార్యాలయంపైన నూతనంగా నిర్మించిన బ్యారక్‌ను బుధవారం ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ సతీష్ కుమార్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ నిత్యం శాంతిభద్రతల పరిరక్షణలో తలమునకలై శ్రమిస్తున్న ఎస్‌టీఎఫ్ సిబ్బంది కష్టాన్ని గుర్తించి వారి విశ్రాంతి కోసం ఎస్పీ నూతన బ్యారక్ నిర్మించడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ప్రజా సమస్యల పరిరక్షణకై పాటు పడుతున్న పోలీస్ సిబ్బంది సంక్షేమం కోసం ఆలోచించడం అనేది గొప్ప విషయమన్నారు. భవిష్యత్తులో క్షేత్ర స్థాయి సిబ్బంది సంక్షేమం కోసం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ సమయంతో సంబంధం లేకుండా జిల్లాలో ఏ మూలన ఎటువంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా, ఎటువంటి శాంతిభద్రతల సమస్య తలెత్తినా వెంటనే అక్కడకు వెళ్లి అక్కడ పరిస్థితులను చక్కదిద్దడంలో ఎస్‌టీఎఫ్ సిబ్బంది కృషి వర్ణించ లేనిదన్నారు. బ్యారక్‌ను నిర్మించి అందంగా తీర్చిదిద్దడంలో కృషి చేసిన అదనపు ఎస్పీ (ఏఆర్) ఎ.హనుమంతు, అడ్మిన్ ఆర్‌ఐ ఉదయ్ భాస్కర్, వెల్ఫేర్ ఆర్‌ఐ శివ రామ కృష్ణలను ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు జీవీ రమణ మూర్తి, ఎ.హనుమంతు, డీఎస్పీలు సీతారామయ్య, రమేష్, సీఐ వీరనాయక్, ఆర్‌ఐలు శ్రీహరి రెడ్డి, ఉదయ భాస్కర్, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రికవరీ నిలుపుదలపై కృతజ్ఞతలు

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: సీపీఎస్ రికవరీ నిలుపుదల చేయుటకు త్వరిత గతిన చర్యలు చేపట్టినందుకు గాను ట్రెజరీస్ అండ్ ఎకౌంట్స్ డైరెక్టర్ ఎన్.మోహన్‌రావును ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తరపున ఆ సంఘం బాధ్యులు మంగళ వారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఐటీ ని రికవరీ చేయుటలో రాష్ట్రము మొత్తం ఒకే విధానం పాటించాలని, పే స్లిప్‌లో ఫారం 16 లోని లోపాలను సవరించాలని, పే స్లిప్‌ల యందు ఫ్యామిలీ పెన్షనర్ పుట్టిన తేదీని నమోదు చేయుటకు రాష్ట్రం మొత్తం డీటీవోలకు, ఎస్‌టీవోలకు తగిన ఉత్తర్వులు ఇప్పించాలని విన్నవించారు. ట్రెజరీస్ అండ్ ఎకౌంట్స్ డైరెక్టర్‌ను కలిసిన వారిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కోశాధికారి పి.నాగ రాజు, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.లూర్థు రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఎమ్.ఎస్.నాగేంద్రరావు, జిల్లా కార్యదర్శి ఐ.సాయిబాబా తదితరులు ఉన్నారు.

ఆర్టీఐ తూర్పు ఇన్‌ఛార్జ్‌గా పల్లపాటి విజయ్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక వెంగయ్య నగర్‌కు చెందిన పల్లపాటి విజయ్‌ను ప్రజా సంకల్ప వేదిక ఆర్టీఐ విభాగ గుంటూరు తూర్పు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర అధ్యక్షులు మధిరే రంగసాయి రెడ్డి ప్రకటించారు. పల్లపాటి విజయ్ మాట్లాడుతూ గుంటూరు తూరుపు నియోజకవర్గ పరిధిలో ఉన్న ప్రజా సమస్యలను చట్ట పరిధిలో సమాచార హక్కు చట్టం ద్వారా పరిష్కరించే దుకు కృషి చేస్తానని తెలిపారు. తనను తూర్పు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా నియమించి నందుకు రంగసాయి రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రొఫెసర్ చంగయ్యపై దాడిని ఖండించాలి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ : శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ ప్రొఫెసర్ చంగయ్యపై బజరంగ్ దళ్ కార్యకర్తలు చేసిన దాడిని ప్రజాస్వామ్య వాదులందరూ ఖండించాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వరగాని ఏడుకొండలు డిమాండ్ చేశారు. శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ ప్రొఫెసర్ చంగయ్యపై బజరంగ్ దళ్ మతోన్మాద కార్యకర్తల దాడిని ఖండిస్తూ స్థానిక లాడ్జి సెంటర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట బుధవారం సాయంత్రం బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వరగాని ఏడుకొండలు ఆధ్వర్యంలో దళిత బహుజన ప్రజా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగం ప్రకారం ప్రతి వ్యక్తికి స్వేచ్ఛ హక్కు ఉందన్నారు. తన అభిప్రాయాన్ని తెలియజేసేందుకు పూర్తి హక్కు రాజ్యాంగం కల్పించిందన్నారు. ప్రొఫెసర్ చంగయ్యపై జరిపిన మతోన్మాదుల దాడులను ప్రజాస్వామ్యవాదులు ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ సీనియర్ నాయకులు, హైకోర్టు న్యాయవాది వైకే, భగత్ సింగ్, భీమ్ సేవాదళ్ అధ్యక్షులు నల్లపు నీలాంబరం, ఆంధ్రప్రదేశ్ రజక జనసేన సమితి ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రంలో చోరీ... టీవీ అపహరణ

విశాలాంధ్ర-దుర్గి : రైతుసేవా కేంద్రం, గ్రామ సచివాలయంలో చోరీ జరిగిన సంఘటన మండల పరిధిలోని ధర్మ వరం గ్రామంలో బుధవారం వెలుగు లోకి వచ్చింది. అధికారులు ఎప్పటి లాగానే కార్యాలయాలకు వచ్చి విధులు ముగించుకుని తాళాలు వేసి ఇంటికి వెళ్ళారు. గ్రామానికి చెందిన కొందరు బుధవారం ఉదయం కార్యాల యాలు మీదుగా దుర్గికీ వెళ్తుతూ అటువైపు చూడగా తలుపులు తెరిచి ఉండటంతో సంబంధిత ఉద్యోగులకు సమాచారం అందించారు. దీంతో ఉద్యోగులు కార్యాలయాల వద్దకు వచ్చి చూడగా గుర్తు తెలియని దొంగలు మంగళవారం రాత్రి సమయంలో తాళాలు తీయ కుండా కాళ్ళతో తలుపులను బలంగా తన్నడంతో తలుపులు తెరుచుకుని ఉన్నాయి. రైతు సేవా కేంద్రంలోకి పరిశీలించగా రూ. 20వేల విలువగల శామ్ సంగ్ పలక టీవీ అపహరణకు గురైంది. పంచాయితీ కార్యదర్శి ఎన్.శివశంకరరావు రైతు సేవా కేంద్రంలో చోరీ జరిగి టీవీ అపహరణకు గురైనట్లు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. క్లూస్ టీమ్స్ వచ్చేసి రెండు కార్యాలయాల ఉద్యోగుల నుంచి వేలిముద్రలు, తలుపులపై ఉన్న కాళ్ళ ముద్రలు సేకరించారు.

188 సచివాలయ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : బయోమెట్రిక్‌లో హాజరు నమోదు చేయని 188 సచివాలయ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు విధిగా బయోమెట్రిక్ ద్వారా హాజరు నమోదు చేయాలని, వరుసగా 13 రోజులు పాటు బయోమెట్రిక్ నమోదు చేయని కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 188 మంది వార్డు సచివాలయ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. వార్డు సచివాలయ కార్యదర్శులు విధిగా సమయపాలన పాటిస్తూ తప్పనిసరిగా బయోమెట్రిక్ ద్వారా హాజరు నమోదు చేయాల్సిందేనన్నారు. ఉమెన్ అండ్ వీకర్ సెక్షన్ ప్రొటెక్షన్ కార్యదర్శులు 13, వెల్ఫేర్ 8, ఎడ్యుకేషన్ 35, అడ్మినిస్ట్రేషన్ 26, ఎమినిటిస్ 46, శానిటేషన్ 17, రెవెన్యూ 32, హెల్త్ 11 మంది కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేసామని తెలిపారు.

లింకు దస్తావేజులు పోయినవి

గుంటూరు సిటీ, వడ్డూరివారి వీధి, డోరు నెం. 12-1-67 నివాసి పొత్తూరి అనురాధ (సెల్: 75699 85166) భర్త : పొత్తూరి వెంకటరావు తెలియజేయునది: గుంటూరు సిటీ, గోరంట్ల డి.నెం.476లోని చ.గ.400ల స్థలము నా పేరిటకు రెండు విక్రయ దస్తావేజులు 5206/2024 మరియు 5222/2024 ద్వారా రిజిస్టరు కాబడినవి. సదరు దస్తావేజులకు సంబంధించిన లింకు దస్తావేజులు డి.నెం.4180/1991 మరియు డి.నెం.4349/1991 లను ది.28-11-2024న గోరంట్లలోని నా స్థలము నుండి సమీపంలోని ఇన్నర్ రింగురోడ్డులో గల ఓ ఫొటోస్టాట్ సెంటర్‌కు జిరాక్సు నిమిత్తం వెళ్ళుచుండగా పోయినవి. ఈ లింకు దస్తావేజులు 4180/1991 మరియు 4349/1991 ఎవరికైనా దొరికిన యెడల పై చిరునామాలో తెలియజేయగలరు.

భోపాల్ దుర్ఘటన నుంచి పాఠాలు నేర్చుకోని పాలకులు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : భారత పారిశ్రామిక చరిత్రలో మరిచి పోలేని విషాద సంఘటనగా మిగిలిన భోపాల్ దుర్ఘటన నుంచి పాలకులు పాఠాలు నేర్చుకోలేదని, విశాఖ లాంటి ప్రాంతాల్లో అటువంటి ప్రమాదాలే చోటు చేసుకుంటున్నాయని విద్యావేత్త ఎస్.రవిబాబు పేర్కొన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో 'భోపాల్ మృత్యు నగరంగా మారి 40 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా చర్చా కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీ కక్కిన విషంతో భోపాల్ మృత్యు నగరంగా మారి 40 ఏళ్ళు గడిచి పోయాయని, ఇప్పటికీ దాని దుష్ప్రభావాలు భోపాల్ వాసులను వెంటాడుతున్న నేపథ్యంలో అటువంటి దారుణాలు మళ్ళీ జరగకుండా చర్యలు తీసుకోవటంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్ మాట్లాడుతూ ఒక్కసారిగా విషవాయువులు చుట్టుముట్టడంతో ఏం జరుగుతుందో అర్థంకాక ఊపిరి ఆడక విష వాయువుల బారి నుంచి ప్రాణాలు కాపాడుకోవటానికి పరుగులు తీసిన భోపాల్ వాసులు 10,047 మంది ప్రాణాలు కోల్పోయారని, 5,74,00 మంది విషవాయువులకు గురయ్యారన్నారు. టి.నారపరెడ్డి, వెంకటరత్నం, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న సైకిల్ మెకానిక్

విశాలాంధ్ర-తాడేపల్లి : ఉండవల్లి గ్రామానికి చెందిన సైకిల్ మెకానిక్ రమణ అనే వ్యక్తి అకౌంట్‌కి ఒడిస్సా రాష్ట్ర మల్కానగిరి గ్రామానికి చెందిన దంకాజ్ మఝాహి అనే వ్యక్తికి చెందిన అకౌంట్ నుంచి పొరపాటున లక్ష రూ.లు రావడంతో అవి తన డబ్బులు కావని గ్రహించి తిరిగి బాధితుడి అకౌంట్‌కి లక్ష రూ నగదును రమణ తిరిగి పంపించాడు. రమణ డబ్బులు వెనక్కి పంపించడంతో కృతజ్ఞతతో తిరిగి మూడు వేలు రమణకు బాధితుడు పంపించాడు. సకాలంలో బాధితుడికి పంపించి తన నిజాయితీని నిరూపించు కున్న రమణను గ్రామస్తులు అభినందించారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై రోశయ్య చెరగని ముద్ర: చీఫ్ విప్ జీవీ

విశాలాంధ్ర - వినుకొండ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లోనే చెరగని ముద్ర వేసిన అరుదైన వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి దివంగత కొణిజేటి రోశయ్య అని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు కొని యాడారు. సౌమ్యుడు, సహన శీలిగానే రాజకీయాల్లో తనదైన శైలిని ప్రదర్శించేవారని తెలిపారు. కొణిజేటి రోశయ్య 3వ వర్ధంతి సందర్భంగా వినుకొండలో జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన స్థానిక నరసరావు పేట రోడ్డులోని సాయిబాబా గుడి వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన చీఫ్ విప్ జీవీ రోశయ్య తనవిలక్షణ శైలితో అజాత శత్రువుగా పేరు తెచ్చుకున్నారని, ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా, తర్వాత తమిళనాడు గవర్నర్‌గానూ సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గురునాథం, పి.వి. సురేష్ బాబు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు పఠాన్ అయూబ్ ఖాన్, మేడా రమేష్ బీజేపీ నాయకులు, మోటమర్రి నరసింహారావు, గోరంట్ల హనుమంతరావు, పలువురు ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన ఏపీ జీఈఏ నాయకులు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రభుత్వ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీ జీఈఏ)గుంటూరు జిల్లా అధ్యక్షులు సయ్యద్ చాంద్‌బాషా జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి కోరారు. ఈ మేరకు బుధవారం ఏపీ జీఈఏ జిల్లా కార్యవర్గ సభ్యులు కలెక్టర్‌ను కలిసి ప్రభుత్వ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు. 35 సంవత్సరాల ప్రభుత్వ సర్వీసు చేసి కనీసం ఇంటి నిర్మాణం కూడా నోచుకోని పరిస్థితిలో నేడు ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇటువంటి పరిస్థితిలో గుంటూరు కార్పొరేషన్ పరిధిలో వారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. ఇప్పటి వరకు వారికి కరువు భత్యం బకాయిలు చెల్లించలేదన్నారు. పీఆర్సీ కూడా ప్రకటన చేయలేదని, కనీసం నగదు రహిత వైద్య చికిత్సను ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు నెట్వర్క్ హాస్పిటల్స్‌లో అందడం లేదని కలెక్టర్ నాగలక్ష్మి తెలియజేశారు. అసోసియేషన్ జిల్లా ఆర్గనైజ్ సెక్రటరీ కరీముల్లా, శాఖ జిల్లా కోశాధికారి పోతురాజు, ఉపాధ్యక్షులు విజయబాబు, నగరశాఖ అధ్యక్షులు వై.నాగేశ్వర రావు, కార్యదర్శి సాంబశివారెడ్డి, కోశాధికారి శ్రీనివాస్, లెక్చరర్ సంఘం నాయకులు నాగూర్ వలి, పాల్గొన్నారు.

విధులను బహిష్కరించిన న్యాయవాదులు

విశాలాంధ్ర-సత్తెనపల్లి : పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం చిగురుపాడు గ్రామంలో మంగళవారం రాత్రి కొంతమంది వ్యక్తులు న్యాయవాది మేదర అనిల్ కుమార్ కారును అడ్డగించి దాడి చేయటంతో స్థానికులు చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు కంబాల అనిల్ కుమార్ సదరు న్యాయ వాదిని రాత్రి పరామర్శించారు. ఈ నేపథ్యంలో న్యాయవాదిపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు సయ్యద్ అబ్దుల్ రహీమ్, గుజ్జులపూడి మార్కురావు, సందెపోగు బాబురావు, చిన్నం మణి బాబు, జొన్నల గడ్డ విజయ్ కుమార్, న్యాయవాదుల గుమస్తాల సంఘం అసోసి యేషన్ రాష్ట్ర అధ్యక్షులు అంగులూరి సుబ్బారావు, సత్తెనపల్లి అధ్య క్షులు మర్రి నరసింహారావు, కార్యదర్శి బలిజేపల్లి కోటిరత్నం తదిత రులు చికిత్స పొందుతున్న న్యాయవాది అనిల్‌ను పరామర్శించారు.

వక్ఫ్‌బోర్డు సీఈఓపై సమగ్రంగా దర్యాప్తు చేయించాలి

- రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన మహ్మద్ ఖలీమ్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మైనారిటీ సంక్షేమ శాఖ సెక్రటరీ వారు 2024 నవంబర్ 29వ తేదీన రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈఓకు జారీ చేసిన మెమోపై కేవలం ఒక కంటి తుడుపు చర్యగా కాకుండా దీనిపై సమగ్రంగా రాష్ట్ర ప్రభుత్వం దర్యాప్తు చేయించాలని ముస్లిం యునైటెడ్ యునైటెడ్ ఫ్రంట్, ముస్లిం జేఏసీ అధ్యక్షులు మహమ్మద్ ఖలీమ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మాయాబజార్‌లో ఉన్న కార్యాలయము నందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వక్ఫ్ పాలకవర్గం లేకుండానే పలు వక్ఫ్ సంస్థలకు కేర్ టేకర్ కమిటీలు నియమించిన సీఈఓపై పలు విమర్శలు, ఆరోపణలు రావటంతో మైనారిటీ సంక్షేమ శాఖ సెక్రటరీ మెమో జారీ చేసి కేర్ కమిటీలు నియమించేందుకు వక్ఫ్ బోర్డు చట్టంలో రూల్ పొజిషన్‌ను కోరుతూ వివరణ ఇవ్వాలని మెమో జారీ చేసినట్లు తెలిపారు. సీఈఓగా అర్హత లేని అబ్దుల్ ఖదిర్‌ను తొలగించి తక్షణమే రెగ్యులర్ సీఈ ఓను నియమించాలని కోరుతూ మైనారిటీ డైరెక్టర్ కిషోర్ బాబు 2022 నివేదికను అప్పటి మైనార్టీ సంక్షేమ సెక్రటరీకి పంపినట్లు తెలిపారు. అయినా ఇప్పటికీ వరకు దీనిపై ఎటువంటి చర్య లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హత లేని అబ్దుల్ ఖదిర్ ఇప్పటికీ వక్ఫ్‌బోర్డు సీఈఓగా కొనసాగుతున్నట్లు ఆరోపించారు. సీఈఓగా అర్హత లేని అబ్దుల్ ఖదిర్‌కు కేర్ టేకర్ కమిటీ నియమించే అధి కారం ఉందాఅని ప్రశ్నించారు? ఇతను నియమించిన కేర్ టేకర్ కమిటీలను సవాలు చేస్తూ పలువురు న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తుండగా దీని పై వాదనలు వినిపించేందుకు రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సంస్థ లక్షల రూపాయలు సీని యర్ అడ్వకేట్‌లకు చెల్లిస్తుందని ఆరోపిం చారు. వక్ఫ్ సొమ్ము దుర్వినియోగం అవుతుందనటానికి ఇంత కన్నా మరో ఉదా హరణ కావాలా అని ప్రశ్నించారు. వక్ఫ్ సంస్థలకు పాలక వర్గాలను నియమించే అధికారం తొలగించే అధికారం రాష్ట్ర వక్ఫ్ పాలక వర్గానికి మాత్రమే ఉంటుందని పేర్కొన్నారు.

6 నుంచి రెవెన్యూ సదస్సులు : చీఫ్‌విప్ జీవీ

విశాలాంధ్ర - వినుకొండ : ప్రజల ఆస్తులకు రక్షణ ప్రాధాన్యంగా కూటమి ప్రభుత్వం వరస చర్యలు తీసుకుంటుందని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన భూకబ్జాలు, అక్రమాలు సరిచేయడంతో పాటు ఇకపై ఎవరైనా పరాయివాళ్ల భూములపై కన్నేయాలంటేనే భయపడేలా సమగ్ర భూకబ్జాల నియంత్రణ చట్టం కూడా తీసుకుని రావడం జరిగిందన్నారు. భవిష్యత్‌లో భూహక్కుల సమస్యల్లేని రెవెన్యూ నిర్వహణే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. బుధవారం ఈ మేరకు వినుకొండ తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వైసీపీ భూ ఆక్రమణలు, రెవెన్యూ రికార్డుల్ని అస్తవ్యస్తం చేసిందని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. డిసెంబర్ 6 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, రెవెన్యూ అధికారులే స్వయంగా గ్రామాలకు వస్తున్నారని, ఏమైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయాలని, వచ్చిన ఫిర్యాదులపై 45 రోజుల నిర్దిష్ట కాలవ్యవధిలో మీ సమస్యలన్నీ పరిష్కారం అవుతాయన్నారు. రికార్డుల ట్యాంపరింగ్, ఆన్‌లైన్‌లో వివరాల మార్పు, దొంగ పత్రాలు సృష్టించి హక్కుదారుల్ని రోడ్డున పడేయడం, తాతల నాటి ఆస్తులూ కాజేయం వంటి ఎన్నో దారుణాలకు పాల్పడ్డారన్నారు. వాటిని సక్రమం చేసుకునేందుకు తెచ్చిన దుర్మార్గపు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను సీఎం చంద్రబాబు రద్దు చేశారన్నారు. పారా లక్ష్మయ్యను ఘనంగా సన్మానించారు. వినుకొండ సహ పల్నాడు జిల్లాలో పశుసంపద ఎక్కువని, గేదెలు, గొర్రెలు, మేకలు, ఇతర పశు సంపద ఇక్కడ ఉందన్నారు. దానిపై పారా లక్ష్మయ్యకు అపారమైన అనుభవం ఉందని, వారి అనుభవంతో పశుసంవర్ధక శాఖలో గొప్ప మార్పులు తీసుకొస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, లగడపాటి వెంకట్రావు, పీవీ సురేష్‌బాబు, పెమ్మసాని నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

రైల్వే సమస్యలు పరిష్కరించండి

- లోక్ సభలో టీడీపీ ఫ్లోర్ లీడర్ లావు శ్రీకృష్ణదేవరాయలు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : రైల్వే సవరణ బిల్లు-2024పై జరిగిన చర్చలో టీడీపీ ఫ్లోర్ లీడర్, నరసరావు పేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొని బిల్లును స్వాగతించారు. ఈ బిల్లు ద్వారా దేశవ్యాప్తంగా రైల్వే మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి ప్రాజెక్ట్ అమలును వేగవంతం చేసేలా స్వయంప్రతిపత్తిని వికేంద్రీకరించాలని కేంద్రాన్ని కోరారు. ఆంధ్ర రాష్ట్ర రాజధాని ప్రాంతాన్ని ప్రధాన మెట్రోపాలిటన్ నగరాలకు అనుసంధానం చేసే అమరావతి రైల్వే లైన్ ప్రాజెక్టుకు రూ.2,245 కోట్లతో ఆమోదం తెలిపినందుకు కేంద్ర ప్రభుత్వానికి, రైల్వే మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. పల్నాడులోని ఆరు రైల్వేస్టేషన్లను అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద చేర్చడాన్ని అభినందిస్తూ వీటి పురోగతిని ముందుకు తీసుకునివెళ్లాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులు.. నడికుడి-శ్రీకాళహస్తి, కడప-బెంగళూరు, రేణిగుంట-గూడూరు, కోటిపల్లి-నర్సాపూర్ లైన్లను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. నరసరావుపేటలో స్టాపేజీతో గుంటూరు-బెంగళూరు మధ్య వందే భారత్ కనెక్టివిటీని ప్రవేశపెట్టాలని, కొవిడ్ లాక్ డౌన్‌లో నిలిపివేయబడిన రైల్వే స్టాప్‌లను పునరుద్ధరించాలని, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యం కోసం 24 రైల్వే అండర్‌పాస్‌లను ఓవర్‌పాస్‌లుగా మార్చడానికి వేగవంతమైన చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. పండ్లు, కూరగాయలకు 50 శాతం రవాణా సబ్సిడీతో పాటు, ఉద్యానవన ఉత్ప త్తులకు కీలకమైన సేవ అయిన అనంతపురం నుంచి న్యూఢిల్లీకి కిసాన్ రైలును పునరుద్ధరించాలని కోరారు. కొవిడ్‌లో నిలిపివేయబడిన సీనియర్ సిటిజన్ ప్రయాణ రాయితీలను పునరుద్ధరించాలని అభ్యర్థించారు.

మిగిలిన ఆహారాన్ని వృధా చేయకండి

విశాలాంధ్ర-పెదకూరపాడు : అన్నం పెట్టిన చేతిని ఆపదలో ఉన్న మనిషిని ఎన్నటికీ మర్చిపోకూడదని, ఆహారాన్ని వృధా చేయకండి పేదల ఆకలి తీర్చండి అంటూ జనచైతన్య సమితి ప్రతినిధులు ముందుకు వచ్చి చేస్తున్న సేవలు ఆదర్శనీయమని గ్రామ పెద్దలు ఒంటిపులి అంకమ్మ రావు అన్నారు. అమరావతి మండలంలోని మండేపూడి గ్రామంలో గల గంగా భ్రమరాంబ సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో కార్తీకమాసం సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమంలో మిగిలిపోయిన భోజనం గురించి ఆలయ కమిటీ పెద్దలు మంగళ గిరి లక్ష్మీపతి జన చైతన్య సమితి(జేసీఎస్) కార్యదర్శి తుళ్లూరి సాంబశివరావుకు ఫోన్ ద్వారా సమాచార ఇవ్వడంతో వారు అక్కడికి వెళ్లి మిగిలిన ఆహారాన్ని తీసుకువచ్చి పెదకూరపాడు మండలంలోని 75 తాళ్లూరు శాంతి కాలనీలో గల బేద బుడగ జంగాల కాలనీలో పంపిణీ చేశారు. జన చైతన్య సమితి కార్య దర్శి తుళ్లూరి సాంబశివరావు మాట్లాడుతూ మిగిలిన ఆహారాన్ని వృధా చేయకుండా పేదవారి కడుపు నింపడం తమకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జన చైతన్య సమితి కోఆర్డితోటి అనిల్ కుమార్, వలంటీర్లు దాసరి కారుణ్యబాబు, రాగిడి ప్రేమ్‌కుమార్, కాలనీ పెద్దలు కిన్నెర అచ్చయ్య, అంజయ్య, గంధం వీర్లంక, సాంబయ్య తదితరులు ఉన్నారు. ఆహారం మిగిలితే 9885557987, 8886777767, 9492271417, 9848977677 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్ దినేష్ రాఘవేంద్ర

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి తహశీల్దార్‌గా కె.దినేష్ రాఘవేంద్ర బుధవారం బాధ్యతలు స్వీకరించారు. దినేష్ రాఘవేంద్ర పెదకాకాని డిప్యూటీ తహశీల్దార్‌గా రీ సర్వేకి పనిచేసే పనిచేశారు. ఇప్పటి వరకు మంగళగిరి తహశీల్దార్‌గా పనిచేసిన షేక్ మహబూబ్ సుభాని సెలవుపై వెళ్లినట్లుగా సమాచారం.

గొలుసు అపహరణకు తీవ్రయత్నం... ప్రతిఘటించిన మహిళ

విశాలాంధ్ర-తాడేపల్లి : పట్టపగలు నడిరోడ్డుపై అందరూ చూస్తుండగానే ఓ మహిళ మెడలో చైన్ తెంచుకొని పోవడానికి గుర్తుతెలియని అగంతకుడు ప్రయత్నించిన సంఘటన తాడేపల్లి కొత్తూరులో బుధవారం జరిగింది. కొత్తూరు చెందిన శ్రీనివాస్ రెడ్డి భార్య తన ఇంటి ముందు షాపు వద్ద నిలబడి ఉండగా, అటుగా బైక్‌పై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి కొద్దిసేపు అక్కడ ఉన్నట్లు నటించి మహిళ మెడలోని గొలుసు తెంచుకొని పారిపోవటానికి తీవ్ర ప్రయత్నం చేశాడు. ఆమె ప్రతిఘటించడంతో దొంగ ప్రయత్నం విఫలమై తన బండి మీద పలాయానం చిత్తగించాడు. కొంతమంది యువకులు దొంగను వెంటబడిన దొరక్కుండా పారిపోయాడు. మాజీ సీఎం జగన్ ఇంటి సమీపంలో ఉన్న సీసీ కెమెరాలు పరిశీలిస్తే దొంగ ఆనవాలు తెలిసే అవకాశం ఉంది. ఇటీవల తాడేపల్లి, ఉండవల్లి ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్‌లు తగ్గుముఖం పట్టాయి. బుధవారం మరల ఈ ఘటన చోటుచేసుకోవడంతో మహిళల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

శబరిమల భక్తులకు వైద్య సేవలు అందించడం మహాభాగ్యం

- డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : శబరిమల వచ్చే అయ్యప్ప భక్తులకు వైద్య సేవలు అందించడం మహాభాగ్యంగా భావిస్తున్నామని ప్రముఖ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి తెలిపారు. డిశంబర్ 1వ తేదీ నుంచి శబరిమల పంబ వద్ద నాలుగు రోజులు పాటు బూసిరెడ్డి నేతృత్వంలోని వైద్య బృందం భక్తులకు వైద్య సేవలు అందించారు. ట్రావెన్కోర్ దేవస్థానం బోర్డు వైద్యుల ఆహ్వానం మేరకు ఆరుగురు వైద్యులతో కూడిన బృందం పంబ వద్ద ఉన్న దేవ స్థానంకు చెందిన వైద్యశాలలో అక్కడకు వచ్చే భక్తులకు ఉచితంగా సేవలు అందిం చారు. ఈ మేరకు బుధవారం డాక్టర్ నరేంద్రరెడ్డి ఓ ప్రకటన ద్వారా అక్కడి విశేషాలను వివరించారు. శబరిమలలో కురు స్తున్న భారీ వర్షాల కారణంగా భక్తులు కొంతమేర ఇబ్బందులకు గురయ్యారని, కొంతమంది ఆయా సం, దగ్గు, జలుబు జ్వరంతో బాధ పడే వారికి వైద్య సేవలు అందించామన్నారు. వర్షాల కారణంగా కొండల మీద జారిపడి ఫ్యాక్చర్లకు గురైన వారికి ప్రాథమిక చికిత్సలో భాగంగా పిండికట్లు వేసి కొట్టాయం జిల్లా ఆసు పత్రికి అంబులెన్స్ ద్వారా తరలించడం జరుగుతు న్నదని చెప్పారు. పంబ వద్ద రెండు రోజులు కొండమీద ఆలయం వద్ద మరో రెండు రోజుల పాటు వైద్య సేవలు అందించామని, అనేక రాష్ట్రాల నుంచి తరలివచ్చే అయ్యప్ప భక్తు లకు ఉచితంగా వైద్య సేవలు అందించడం భగవంతుడు కల్పించిన అవకాశంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన వైద్యులు జనవరి 17వ తేదీ వరకు ఉచిత వైద్య సేవలు అందజేస్తారని డాక్టర్ నరేంద్రరెడ్డి వెల్లడించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర-పెదకూరపాడు : అనారోగ్యం భారిన పడిన ఎనిమిది మంది పేదలకు మంజూరైన రూ.16,11, 504ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ చేతుల మీదుగా బాధితులకు బుధవారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు ఆపదలో ఉన్నవారికి అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఏర్పాటు చేయటం అభినందనీయ మన్నారు. నియోజకవర్గ టీడీపీ నేతలు నందిగం ఆశీర్వాదం, అతిమళ్ళ కృష్ణ, సదాశివరావు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యంపై ఆరుద్ర ముద్ర విశిష్టమైనది

– ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ పరుచూరి విజయలక్ష్మి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : తెలుగు సాహిత్యంలో వివిధ ప్రక్రియలలో విశేష కృషి చేసి తనదైన ముద్ర వేసిన రచయిత ఆరుద్ర అని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ పరుచూరి విజయలక్ష్మి అన్నారు. గుంటూరు విశాలాంధ్ర 24వ పుస్తక మహోత్సవాలు పురస్కరించుకుని నిర్వహిస్తున్న సాహిత్య కార్యక్రమాలలో భాగంగా బుధవారం స్థానిక లాడ్జి సెంటర్ లోని ఏఎల్ బీఈడీ కళాశాల ప్రాంగణంలో ప్రసిద్ధ కవి ఆలూరి బైరాగి సాహిత్య వేదికపై ఆరుద్ర శత జయంతి సభ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ఆరుద్ర పరిశోధకుడుగా, కథకుడుగా, గీత రచయితగా, విమర్శకుడుగా తెలుగు సాహిత్య చరిత్రలో నిలుస్తారని ఆమె పేర్కొన్నారు. గుంటూరు జిల్లా అరసం ప్రధాన కార్యదర్శి కోసూరి రవికుమార్ మాట్లాడుతూ ఆరుద్ర తెలుగు సాహిత్యంలో ఒక ఇతిహాసాన్ని నిర్మించారని అన్నారు. మార్మిజం భావ జాలంతో ఆరుద్ర రచనలు చేశారన్నారు. అభ్యుదయ సాహిత్యంతో ఆరుద్ర జీవితం ముడిపడిందని చెప్పారు. ఆరుద్ర సాహిత్య పరిశోధకుడుగా చేసిన కృషి మహోన్నతమైందని కొనియాడారు. భాగవతుల శంసరశత శంకశాస్త్రి అసలు పేరు కలిగిన వ్యక్తి ఆరుద్రగా తెలుగు సాహిత్య రంగంలో నూతనాధ్యాయాలను సృష్టించారని రవికుమార్ పేర్కొన్నారు. ఆరుద్ర జీవిత కాలంలో ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని తెలుగు సాహిత్య లోకంలో శిఖరప్రాయంగా నిలిచిన ఆదర్శ సాహితీవేత్త అని కొనియాడారు. ఆరుద్ర అనేక ప్రక్రియ లలో ఆసక్తికరమైన రచనలు చేసి తెలుగు పాఠక లోకానికి సన్నిహితులైనారని ఆయన పేర్కొన్నారు. అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, జిల్లా కార్యదర్శి బుల్లా రవి పాల్గొన్నారు.

నేటి కార్యక్రమం : సాహితీ విమర్శకులు కందిమళ్ళ శివప్రసాద్ అధ్యక్షతన గురువారం సాయంత్రం 6.30 గంటలకు ప్రసిద్ధ కవి ఆలూరి బైరాగి శత జయంతి సభ జరగనుంది. ఈ సభకు ప్రముఖ కవి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుగ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ పాల్గొని ప్రసంగించనున్నారు.

షెడ్యూల్ ప్రకారం రెవెన్యూ సదస్సులు

విశాలాంధ్ర-నరసరావుపేట: ప్రభుత్వం సూచనల మేరకు షెడ్యూల్ ప్రకారం రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. జిల్లాలోని నియోజకవర్గాలకు నియోజకవర్గానికి డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులను స్పెషల్ ఆఫీసర్‌గా నియమించడం జరిగిందని అదేవిధంగా జాయింట్ కలెక్టర్‌ను ప్రత్యేక అధికారిగా నియమించడం జరిగిందన్నారు. రెవెన్యూ సదస్సులు నిర్వహణపై సంబంధిత అధికారులకు టెలికాన్ కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు ఇవ్వడం జరిగింది అని తెలిపారు. జిల్లాలో మొత్తం 366 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయని 150 గ్రామాలలో భూముల రీ-సర్వే ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందన్నారు. సుమారుగా 3300 పిటిషన్లు అందాయని తెలిపారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, పాల్గొన్నారు.

పార్టీ సభ్యత్వంతో బీమా: ఎమ్మెల్యే కన్నా

విశాలాంధ్ర-సత్తెనపల్లి : సత్తెనపల్లి పట్టణం 4వ వార్డులో ఏర్పాటుచేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో సత్తెనపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ, నియోజక వర్గ యువ నాయకులు మన్నెం శివనాగ మల్లేశ్వరావు పాల్గొన్నారు. ప్రతిఒక్కరూ రూ.100లతో తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకోండి. రూ.5 లక్షల వరకు ప్రమాద బీమా, కుటుంబ సభ్యులకు విద్యా, ఉద్యోగ, వైద్య సహాయం అందుతుందని చెప్పారు. వివిధ హోదాల్లో ఉన్న రాష్ట్ర, జిల్లా, నియోజక వర్గ కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై 9, 10తేదీల్లో నిరసలు

– సీపీఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్

విశాలాంధ్ర-దాచేపల్లి : కేంద్రంలోని ఎన్డీఏ ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ వైఫల్యాలకు వ్యతిరేకంగా సీపీఐ జాతీయ, రాష్ట్ర పిలుపు మేరకు ఈ నెల 9, 10న నిరసనోద్యమం చేస్తున్నట్లు పార్టీ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్ తెలిపారు. దాచేపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో నారాయణపురంలోని పార్టీ కార్యాలయ సముదాయంలో ఉన్న ఎన్టీయూ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. దీనికి పార్టీ దాచేపల్లి శాఖ సెక్రెటరీ, ఏఐటీయూసీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమెర వెంకట్రావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్ మాట్లాడుతూ ఆ రెండు రోజులు రెవెన్యూ కార్యాలయం, సచివాలయాల వద్ద చేసే ఆందోళన కార్యక్రమాలకు పార్టీ శ్రేణులు, వ్యవసాయ కార్మికులు, మహిళలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపు నిచ్చారు. విద్యుత్ చార్జీల పెంపుదల, స్మార్ట్ మీటర్లను బిగించడంపై కూడా త్వరలో ప్రదర్శనలకు సిద్ధంగా ఉండాలని ప్రజలను కోరారు. సభకు అధ్యక్షత వహించిన కొమెర వెంకట్రావు మాట్లాడుతూ ఇళ్ళ స్థలాల కోసం అర్జీలు ఇచ్చే కార్యక్రమాన్ని రామాపురం, కేసానపల్లి, సీపీఐ కాలనీ నుంచి కూడా చేయాల్సి ఉందన్నారు. ఏఐటీయూసీ గురజాల నియోజకవర్గ అధ్యక్షుడు వేముల వెంకటరెడ్డి మాట్లాడుతూ జన సమీకరణ ఏర్పాట్లు చేయాలని శాఖ నాయకత్వాలను కోరారు. దీని కోసం సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీనియర్ నేతలు బుర్రి కృష్ణారెడ్డి, తెలనాకుల సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 26న నిర్వహించే వందేళ్ళ పార్టీ ఆవిర్భావదినోత్సవం సందర్భంగా చేపట్టే కార్యక్రమాలను వివరించారు. దీనిలో భాగంగానే దాచేపల్లి పార్టీ కార్యాలయం నుంచి నారాయణపురం కార్యాలయం వరకు ఎర్రదండు సైన్యం వందలాది మంది తరలి రావాలని పిలుపునిచ్చారు. అమర వీరుల స్థూపంతో సహా దీనికి సంబంధించిన ఏర్పాట్లు కూడా చేస్తున్నట్లు పేర్కొన్నారు. నేతలు లంకా శాంతి, పత్తిపాటి వెంకట నాగరాజు, షేక్ గాలీసా, ఎల్ల భాస్కర్, గంగారం మీరావలీ, రామయ్య తదితరులు మాట్లాడారు. పార్టీ శ్రేణులు, మహిళలు, కార్మికులు, వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.

వీధి విక్రయదారులను ఆదుకోండి

– యూనియన్ నగర గౌరవాధ్యక్షులు కోట మాల్యాద్రి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు నగరంలో వీధి విక్రయదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వారిని ఆదుకోవడానికి నగర కమిషనర్ తగిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వీధి విక్రయదారుల కార్మిక ఫెడరేషన్(ఏఐటీయూసీ) నగర గౌరవాధ్యక్షులు కోట మాల్యాద్రి కోరారు. గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లోని వీఏస్‌కే హాలులో ఫెడరేషన్ సమావేశం బుధవారం జరిగింది. యూనియన్ నాయకులు దూపాటి వెంకటరత్నం అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కోట మాల్యాద్రి మాట్లాడుతూ స్టేట్ వెడ్డింగ్ యాక్ట్-2014 ప్రకారం చిరు వ్యాపారుల హక్కులను కాపాడాలన్నారు. కమిటీ సమావేశం ఏర్పాటు చేసి జోన్‌లను ప్రకటించాలన్నారు. అర్హులైన చిరు వ్యాపారులకు వెండింగ్ కార్డులు ఇవ్వాలని, మెప్మా ఆదేశాలకు అనుగుణంగా చిరు వ్యాపారులకు లోన్‌లు ఇప్పించాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరంలో మెప్మా దేశంలోనే లోన్‌లు ఇవ్వడంలో గుంటూరు నగరం ప్రథమంగా నిలిచిందని, అవార్డు కూడా ఇవ్వడం జరిగిందని గుర్తుచేశారు. అలాగే సైడ్ కాలువలలో పూడికతీత అనంతరం రోడ్డుపై చిరు వ్యాపారులకు అక్కడే వ్యాపారాలు చేసుకునేందుకు అనుమతించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా కమిషనర్ చర్యలు తీసుకోవాలని కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక: సమావేశ అనంతరం ఫెడరేషన్ గుంటూరు నగర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దార్నాసి రామస్వామి, ప్రధాన కార్యదర్శిగా ధూపాటి వెంకటరత్నం, కోశాధికారిగా వీరనాల శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా సీహెచ్ సైదారావు, ఎం.సత్యవతిలను ఎన్నుకోవడం జరిగింది. సంయుక్త కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, కమిటీ సభ్యులను సమావేశంలో ఎన్నుకున్నారు. ఎన్.సాంబశివరావు,రవిబాబు, వెంకటన్న, లలితకుమారి, శేషం బాబు, నాగార్జున, దాదాపుగా 14 సెంటర్ల నుంచి వీధి వ్యాపారులు సమావేశంలో పాల్గొన్నారు.

గత ప్రభుత్వం చేసిన పాపం... ప్రజలకు శాపం: సీపీఐ

విశాలాంధ్ర-అమరావతి : గత ప్రభుత్వం చేసిన పాపం ప్రజలపై శాపంగా మారిందని సీపీఐ పెదకూరపాడు నియోజకవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రమైన అమరావతిలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని ప్రసంగించారు. సమావేశానికి శాఖ కార్యదర్శి శీలం ముని అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు అదేవిధంగా విద్యుత్తు ట్రూ ఆఫ్ చార్జీలు పెంచనని ఎన్నికల ముందు నమ్మబలికి అధికారం చేపట్టిన తర్వాత విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై పెనుభారం మోపే ప్రభుత్వాలకు గత ప్రభుత్వం పట్టిన గతే పడుతుందని హెచ్చరిక చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బైరాపట్నం రామకృష్ణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత మౌలిక సదుపాయాలలో భాగంగా ప్రధాన రోడ్లు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాలలో నివేశ స్థలాలు లేని నిరుపేదలకు పట్టణ ప్రాంతాలలో రెండు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు కేటాయించి ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు ప్రభుత్వపరంగా విడుదల చేసి గృహ నిర్మాణాన్ని ప్రభుత్వపరంగా నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ నెల 26వ తేదీ సీపీఐ వ్యవస్థాపక దినోత్సవాన్ని మండల పరిధిలో అన్ని శాఖలలో జెండా ఆవిష్కరణ ప్రదర్శన నిర్వహించాలని కోరారు. రోజురోజుకి పెరిగిపోతున్న ధరలను నియంత్రించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో విఫలమైందని అన్నారు. సమావేశంలో అమరావతి మండల కార్యదర్శి కారంపొడి చెన్నకేశవరావు, సీపీఐ నాయకులు కె.మంత్రాలు, ఏసు, కె.శివశంకర్, సీహెచ్ ఉదయ శేఖర్, గుదే పానయ్య, జి.రాజు, ప్రజానాట్యమండలి గౌరవాధ్యక్షులు, మాజీ సర్పంచ్ జాస్తి సత్యమూర్తి, మహిళా సంఘం నాయకురాలు మేడ మల్లేశ్వరి, తోట జానకి, బి.వేదాంతం, గాలం సాంబశివరావు, మేడ శంకర్, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఆచార్య ఈశ్వరరెడ్డికి 'తుమ్మల సాహితీ' పురస్కారం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : అరసం నిర్మాత, అమరజీవి తుమ్మల వెంకటరామయ్య సాహితీ పురస్కారాన్ని 2024 సంవత్సరానికి యోగి వేమన విశ్వ విద్యాలయం తెలుగు అధ్యాపకులు, అరసం రాష్ట్ర అధ్యక్షవర్గ సభ్యులు ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డికి ఇవ్వనున్నట్లు అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిశంబర్ 7, 2024 శనివారం సాయంత్రం అరసం ఆధ్వర్యంలో విశాలాంధ్ర బుక్ ఫెస్టివల్ ప్రాంగణంలో జరిగే సత్కార సభలో విశాలాంధ్ర విజ్ఞాన సమితి జనరల్ మేనేజర్ పి.హరనాథ రెడ్డి రూ.5వేల నగదు, శాలువా, జ్ఞాపికతో ఈశ్వరరెడ్డిని సత్కరిస్తారన్నారు. సభకు అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహిస్తారని, ఈ సభలో ఈశ్వర్‌రెడ్డి అభ్యుదయ సాహిత్యంపై తుమ్మల స్మారక ప్రసంగం చేస్తారన్నారు. ప్రొఫెసర్ ఎన్.ఈశ్వర్‌రెడ్డి ఎం.ఎ తెలుగు, కమ్యూనికేషన్ జర్నలిజంలో పీహెచ్‌డీ పట్టాలను పొందారని, కన్నీటి సీమ, సోమసుందర్ సాహిత్య దృక్పథం, సాహిత్యం- సామాజిక అవసరం, సమాజం మొదలగు కవిత్వ విమర్శ గ్రంథాలను ప్రచురించినట్లు తెలిపారు. 80కి పైగా జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పత్ర సమర్పణ చేసినట్లు పేర్కొన్నారు. యోగి వేమన విశ్వ విద్యాలయ అధ్యాపక సంఘం వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షవర్గ సభ్యులుగా ఈశ్వర్‌రెడ్డి కొనసాగుతున్నట్లు వల్లూరు శివప్రసాద్ వెల్లడించారు.

6న రెవెన్యూ సదస్సుకు ఏర్పాట్లు పూర్తి: కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : జిల్లాలోని 173 గ్రామాలకు గాను తొమ్మిది మండలాల్లోని 62 గ్రామాల్లో రీ సర్వే పూర్తి అయిందని, ఈ నెల 6వ తేది నుంచి జనవరి 8వ తేది వరకు నిర్వహించే రెవెన్యూ సదస్సుకు అన్ని ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్, స్టాంప్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు తెలిపారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణ నేపథ్యంలో బుధవారం మంగళగిరిలోని సీసీఎల్ఏ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్, స్టాంప్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో గుంటూరు కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి, రెవెన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చెస్ క్రీడాకారుడు కార్తీక్‌కు అభినందనలు

విశాలాంధ్ర - విజయవాడ స్పోర్ట్స్ : విజయవాడకు చెందిన ఇంటర్నేషనల్ చెస్ ప్లేయర్ కె. వెంకట క్రిష్ణ కార్తీక్ విజయవాడలోని శాప్ కార్యాలయంలో, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) చైర్మన్ అనిమిని రవి నాయుడుని బుధవారం కలిశారు. కిర్గిస్థాన్‌లో నవంబర్ 10 నుంచి 18 వరకు జరిగిన ఏషియన్ చెస్ చాంపియన్‌షిప్ ఫర్ డిసెబిలిటీస్ (ఏషియన్ చెస్ చాంపియన్‌షిప్ ఫర్ డిసెబిలిటీస్) పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున ప్రాతినిధ్యం వహించి ప్రథమ స్థానంలో నిలిచినట్లు రవి నాయుడుకి వివరించారు. ఈ సందర్భంగా శాప్ ఛైర్మన్ కార్తీక్ నీ సత్కరించి శాప్ నుండి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

ఘంటసాల గానం అజరామరం

విశాలాంధ్ర-అవనిగడ్డ : గాన సామ్రాట్ ఘంటసాల గానం అజరామరం అని ప్రపంచ దేశాలు సైతం ఆయనను గుర్తించి జయంతి ఉత్సవాల నిర్వహించటం అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఘంటసాల 102వ జయంతి వేడుకలు బుధవారం సాయంత్రం స్థానిక నవజీవన్ పబ్లిక్ స్కూల్ ఆవరణలో జరిగాయి. కొండవీటి ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం న్యాయవాది రామశెట్టి వేణుగోపాలరావు మాట్లాడుతూ గంటసాల జీవిత విశేషాలను సోదాహరణంగా వివరించారు. జర్నలిస్టు జి సూర్యనారాయణ మినీ కవితల రూపంలో ఘంటసాల విశిష్టతను వివరించారు. గాయకులు కే చంద్రశేఖర రావు, టీవీ పాండురంగారావు , కె యూరి గగారిన్, డి ఉమామహేశ్వరరావు తదితరులు ఘంటసాల గీతాలను ఆలపించి ఆహుతులను ఆకట్టుకున్నారు తొలత బదేలత స్వాగతం పలికారు.

కోటక్ మ్యూచువల్ ఫండ్ మార్కెట్ అవుట్ లుక్ విడుదల

విశాలాంధ్ర-విజయవాడ: కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్మెంట్ కంపెనీ లిమిటెడ్ బుధవారం మార్కెట్ ఔట్లుక్ 2025 నివేదికను విడుదల చేసింది. కోటక్ మ్యూచువల్ ఫండ్, భారత ఆర్థిక వ్యవస్థ, మూలధన మార్కెట్ల దిశలో స్థూల-ఆర్థిక దృక్పథాన్ని పంచుకుంటూ, రాబోయే సంవత్సరంలో పెట్టుబడిదారులు చూడగలిగే వివిధ పెట్టుబడి థీమ్లను హైలైట్ చేస్తూ నివేదికను ప్రారంభించింది. 2025లో మార్కెట్లకు సహాయపడే ఐదు కీలక థీమ్‌లను నివేదిక హైలైట్ చేస్తుంది. వాటిలో కాపెక్స్ సైకిల్ పునరుద్ధరణ, ఫైనాన్షియల్ సర్వీసుల విస్తరణ, సాంకేతికత -ఆధునిక యుగం సేవా ఆఫర్లు, వినియోగం, గ్రామీణ పునరుజ్జీవనం, ఆరోగ్య సంరక్షణ అంశాలు ఉన్నాయి. భారతదేశం ప్రస్తుతం గణనీయమైన మూలధన వ్యయం (కాపెక్స్) చక్రాన్ని ఎదుర్కొంటోందని, ఆర్థిక సేవల రంగం దాని ఉపవర్గాలలో విభిన్న పనితీరును ప్రదర్శిస్తుందని, క్లౌడ్ సేవల్లో ఖర్చు పెరగడంతో ఐటీ సేవల వ్యయం మెరుగుపడుతుందని భావిస్తున్నట్లు నివేదిక పేర్కొంది.

నిబద్ధతగల నాయకుడు రోశయ్య

విశాలాంధ్ర-పెడన: ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో అత్యంత విలువలు గల, నిబద్ధత గల ఏకైక నాయకుడు ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య అని పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు డాక్టర్ కొల్లూరి. చిన్నా అన్నారు. వాసవి ప్రార్థన మందిరంలో రోశయ్య మూడవ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పట్టణ ఆర్యవైశ్య కార్యనిర్వాహక అధ్యక్షులు ఆత్మకూరి సురేష్ కుమార్, ఆర్యవైశ్య మహాసభ సేవా కార్యక్రమాల కమిటీ చైర్మన్ మామిడి వెంకట వరప్రసా దరావు పాల్గొన్నారు.

అజాతశత్రువు రోశయ్య : మండలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యకు అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ ఘన నివాళు లర్పించారు. రోశయ్య నాల్గవ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం పోలీస్ స్టేషన్ సమీపంలో రోశయ్య విగ్రహానికి పూలమాలలు లేసి ఘన నివాళులర్పించి మాట్లాడారు. అవనిగడ్డ మాజీ ఉప సర్పంచ్ ఆర్యవైశ్య జిల్లా నాయకులు ఘంటసాల రాజ మోహన్ రావు అలియాస్ కన్నయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మండలి మాట్లాడుతూ ఆచార్య ఎన్జీరంగా శిష్యుడిగా రాజకీయ ప్రస్థానం చేసిన కాంగ్రెస్ నేత రోశయ్య రాజకీయ భీష్మాచార్యుడు అజాతశత్రువు రాష్ట్రం అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆదేశాల ప్రకారం రాష్ట్రానికి 15వ ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టారన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో రోశయ్యది చెరగడం రాష్ట్ర అసెంబ్లీలో 15 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టి రికార్డ్ బహుముఖ ప్రజ్ఞశాలిగా గుర్తింపు పొందాలన్నారు. రోశయ్య ఆర్థిక మంత్రిగా ముఖ్యమంత్రిగా, తమిళనాడు గవర్నర్‌గా, కర్ణాటక గవర్నర్‌గా, అదనపు బాధ్యతలు నిర్వహించాలన్నారు. రాజకీయాల్లో 60 సంవత్సరాల పాటు వెలుగొందిన మహోన్నత వ్యక్తి రోశయ్య అన్నారు.



ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చిట్టిబాబు, మాజీ జెడ్పిటిసి కొల్లూరు వెంకటేశ్వరరావు, ఆర్యవైశ్య నేతలు దేశ జగన్ మోహన్‌రావు , మునగాల బాలకృష్ణారావు, రోశయ్య అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని రోశయ్యకు ఘన నివాళులర్పించారు.

రొట్టెలు, పండ్లు పంపిణీ

ఆర్యవైశ్య రాజకీయ యోధుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య నాలుగవ వర్ధంతి సందర్భంగా బుధవారం ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ అవనిగడ్డ కార్యవర్గ సభ్యుల సహకారంతో ప్రభుత్వ వైద్యశాల లోని రోగులకు ప్రభుత్వ వైద్యశాల సూపరిటెండెంట్ సురేంద్రనాథ్ చేతుల మీదుగా రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మునగాల బాలకృష్ణారావు, వి శ్రీనివాసరావు, కొల్లిపర్ర రాధాకృష్ణ, కోడూరు పవన్ లతోపాటు పలువురు పాల్గొన్నారు.

కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల వాలీబాల్ టోర్నీ ప్రారంభం

విశాలాంధ్ర - విజయవాడ స్పోర్ట్స్: విజయవాడ రూరల్ మండలం నున్నలోని వికాస్ విద్యాసంస్థల ఆవరణలో విజయ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ ఆధ్వర్యంలో జరుగుతున్న కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల వాలీబాల్ పోటీలు లీగ్ దశకు చేరుకున్నాయి. వికాస్ బీపీఈడీ కాలేజీ, నున్న, పీబీ సిద్దార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ, విజయవాడ, లకిరెడ్డి హనిమిరెడ్డి డిగ్రీ కాలేజీ, మైలవరం, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాల, విజయవాడ జట్లు లీగ్‌కు చేరుకున్నాయి. రెండు రోజులపాటు జరిగే ఈ పోటీలను రాష్ట్ర క్రీడా ప్రాధికారసంస్థ (శాప్) మాజీ చైర్మన్ డాక్టర్ పీ అంకమ్మ చౌదరి బుధవారం ప్రారంభించారు. కృష్ణా యూనివర్సిటీ పరిధిలోని కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల నుంచి పది పురుషుల జట్లు ఈ పోటీలలో పాల్గొన్నాయి. నాకౌట్ కమ్ లీగ్ విధానంలో పోటీలు నిర్వహించారు. నాకౌట్‌లో నాలుగు జట్లు విజయం సాధించి లీగ్‌కు చేరుకున్నాయి. అంతముందు జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో శాప్ మాజీ చైర్మన్ డాక్టర్ అంకమ్మ చౌదరి, వికాస్ గ్రూపు ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ అధినేత నరెడ్ల సత్యనారాయణరెడ్డి క్రీడాకారుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా అంకమ్మ చౌదరి మాట్లాడుతూ, రాష్ట్ర

ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని, అందులో భాగంగానే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల నూతన క్రీడా విధానాన్ని ప్రకటించారన్నారు. అంతర్జాతీయ పోటీలతోపాటు జాతీయస్థాయి పోటీలలో పాల్గొని పతకాలు సాధించిన క్రీడాకారులకు ఇచ్చే నగదు పురస్కారాను ప్రభుత్వం భారీగా పెంచిందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో కూడా ప్రావీణ్యం సంపాదించాలని, క్రీడా ప్రతిభ ఆధారంగా ఉద్యోగవకాశాలు లభిస్తాయన్నారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తే కనీసం రూ.లక్ష నుంచి రూ.10 లక్షల నగదు పురస్కారాలు దక్కే అవకాశం ఉందని, దీనిని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ పరిశీలకుడు డాక్టర్ బీసీహెచ్ సంగీతరావు, విజయ బీపీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల గానం పాటకు ప్రాణం

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : గానగంధర్వుడు పద్మశ్రీ ఘంటసాల గానం పాటకు ప్రాణం అని, తెలుగుజాతికి వరమని ఆధ్యాత్మిక, ధార్మికవేత్త, నటుడు, రచయిత వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. ఘంటసాల 102 వ జయంతి సందర్భంగా బుధవారం ఉదయం తుమ్మల పల్లి వారి

క్షేత్రయ్య కళాక్షేత్రంలో పద్మశ్రీ ఘంటసాల సంగీత కళావేదిక ఆధ్వర్యంలో ఘంటసాల కాంస్య విగ్రహానికి పూలదండలు వేసి అంజలి ఘటించారు. కళావేదిక అధ్యక్ష, కార్యదర్శులు శింగంశెట్టి చంద్రశేఖర్ బొబ్బిలి లీలాకుమార్ తదితర సభ్యులు నిర్వహించగా గాయనీ గాయకులు హరికృష్ణ, కామేశ్వరిలు పలు చిత్రాలలోని పాటలను రసరమ్యంగా పాడి వినిపించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన హజరత్తయ్య గుప్తాకు లీలా కుమార్ ఘంటసాల 102 వ జయంతి సత్కారం చేశారు. ఆయన మాట్లాడుతూ పాట ఏదైనా ఘంటసాల గళంలో జీవం పోసుకుంటుందని త్రిస్థాయిలో పాడినా నిండుదనం తగ్గని గాత్రశుద్ధి కలిగిన గళం ఆయనదన్నారు.

మండలంలో రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు : ఎంఆర్వో

విశాలాంధ్ర-పెనమలూరు : మండలంలో రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఎంఆర్వో ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం గం 9 నుంచి సాయంత్రం గం 5 వరకు రెవెన్యూ అధికారులు ఆయా గ్రామాలలో ఉండి రైతుల సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. ఈ నెల 6 నా యనమలకుదురులో, 10 న కానూరులో, 12 న తాడిగడపలో , 17 న పోరంకిలో, 19 న చోడవరం, 21 న పెదపులిపాకలో , 24 నా గోశాలలో, 27 న గంగూరులో, 31 నా పెనమలూరు లో , జనవరి 3 న వణుకూరులో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా తేదీల్లో, ఆయా గ్రామాలలో రైతులు, ప్రజలు పాల్గొని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు.

7న మెగా తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశం

విశాలాంధ్ర-కూచిపూడి : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ఈ నెల7 శనివారం బడివైపు ఒక అడుగు తల్లిదండ్రులతో ముచ్చట్లు' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మొవ్వ మండల విద్యాశాఖ అధికారిణి-2 కాటూరి శ్రీలక్ష్మి బుధవారం పేర్కొన్నారు. ఈ సమావేశంలో విద్యార్థుల విద్యా వికాసం, వివిధ అంశాలలో వారు అభివృద్ధిని చర్చించి అనేక నిర్ణయాలు తీసుకుంటారని పేర్కొన్నారు. మండలం లోని47ఎంపి ఎలిమెంటరీ పాఠశాలల్లో, మూడు ఎంపీ యూపీ పాఠశాలల్లో , ఎనిమిది జిల్లా పరిషత్ పాఠశాలలో, పెద్ద ముత్తెవి ఎయిడెడ్ హై స్కూల్‌లో పండగ వాతావ రణంగా సమావేశాలు జరుగుతాయని ఆమె పేర్కొన్నారు. మొవ్వ శ్రీ మండల కనకయ్య జిల్లా పరిషత్ హై స్కూల్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సూర్యదేవర శ్రీదేవి, కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర జిల్లా పరిషత్ ఓరియంటల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు గుంటూరు వెంకట సత్య ప్రసాద్ పాల్గొని తమ పాఠశాలలో జరిగే సమావేశ విషయాలను వివరించారు .

మల్టీ అసెట్ అలొకేషన్ ఫండ్‌ను ఆవిష్కరించిన శామ్‌కో మ్యూచువల్ ఫండ్

విశాలాంధ్ర-విజయవాడ: శామ్‌కో అసెట్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ తమ కొత్త ఫండ్ ఆఫర్ అయిన మల్టీ అసెట్ అలొకేషన్ ఫండ్‌ను ప్రకటించింది. ఇది 2024 డిసెంబర్ 4న ప్రారంభమై 2024 డిసెంబర్ 18న ముగుస్తుంది. మెరుగైన రాబడులు అందించడానికి, రిస్కులను తగ్గించడానికి ఈక్విటీలు, గోల్డ్, డెట్/ఆర్బిట్రేజ్ మధ్య ఈ ఫండ్ వ్యూహాత్మకంగా కేటాయింపులను సవరిస్తుంది. ఈ స్కీమ్‌లో కనీస దరఖాస్తు మొత్తం రూ. 5,000గా ఉంటుంది. సంస్థ స్వంత ఆర్‌ఓటీవీటీఈ వ్యూహంపై ఆధారితమైన ఈ ఫండ్, ఈక్విటీలు బుల్ మార్కెట్లో ఉన్నప్పుడు ప్రధానంగా ఈక్విటీ మోడ్‌లోకి మారుతుంది. అలాగే, ఈక్విటీలు నెమ్మదించి బంగారం పెరుగుతున్నప్పుడు గోల్డ్ మోడ్‌లోకి మారే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. అదే ఈక్విటీలు, గోల్డ్ రెండూ తగ్గుతున్నప్పుడు డెట్/ఆర్బిట్రేజ్ మోడ్‌లోకి మారుతుంది. తద్వారా స్థిరమైన రాబడిని అందించడానికి, మదుపరుల సంపదను సంరక్షించడానికి ప్రయత్నిస్తుంది. అసెట్ కేటాయింపుల విషయంలో ఈ ఫండ్ అసమానమైన వెసులుబాటును అందిస్తుంది. క్రమశిక్షణతో ఉండటం కష్టసాధ్యంగా ఉండే ఇన్వెస్టర్లకు ఈ వ్యూహం ఎంతో ప్రయోజనకరంగా ఉండగలదు" అని శామ్‌కో అసెట్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ ఉమేష్ కుమార్ మెహతా తెలిపారు.

అత్యంత వేగవంతమైన స్మార్ట్‌ఫోన్ ఐక్యూ13 విడుదల

విశాలాంధ్ర-విజయవాడ: అధిక-పనితీరు గల స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ ఐక్యూ తాజాగా భారతదేశంఅత్యంత వేగవంతమైన స్మార్ట్‌ఫోన్ ఐక్యూ 13ని విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఇది భారతదేశంలో క్వాల్‌కమ్ స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ చిప్‌సెట్‌తో అమర్చబడిన మొదటి స్మార్ట్‌ఫోన్లలో ఒకటి. ఐక్యూ 13 ధర 12జీబీ జీ256జీబీ వేరియంట్‌కు రూ. 54,999 (సమర్థవంతమైనధర: రూ. 51,999), 16జీబీ జీ512జీబీ వేరియంట్‌కు రూ. 59,999 (సమర్థవంతమైనధర: రూ. 56,999). ఇది రెండు సొగసైన రంగులలో అందుబాటులో ఉంటుంది. అవి: లెజెండ్, నార్డో గ్రే. అదనంగా, ఐక్యూ 13 ప్రీ-బుకింగ్ డిసెంబర్ 05, మధ్యాహ్నం 12 గంటలకు అందుబాటులో ఉంటుంది. దాని మొదటి విక్రయం డిసెంబర్ 11, 2024 నుండి మధ్యాహ్నం 12 గంటలకు వివో ప్రత్యేకస్టోర్లు, ఐక్యూ ఇ-స్టోర్, అమెజాన్.ఇన్‌లలో ప్రారంభమవుతుంది. ఐక్యూ 13 వివో ఎక్స్‌క్లూజివ్ స్టోర్లు, ఇతర మెయిన్‌లైన్ స్టోర్లలో కూడా అందుబాటులో ఉంటుంది. ఈ విస్తరణ ఐక్యూ పరికరాలను అనుభవించే, కొనుగోలు చేసే సౌలభ్యాన్ని నిర్ధారిస్తుంది..